ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శుక్రవారం 11 ఏప్రిల్ 2025

ముస్తాబైన ఏకశిలానగరం

- కల్యాణ వేదిక వద్ద భారీగా ఏర్పాట్లు
- పట్టువస్త్రాలు సమర్పించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాలంకరణ
- భక్తులకు చలువ పందిళ్లు, ఎయిర్‌కూలర్లు


గరుడవాహనంపై కోదండరాముడు


విద్యుద్దీప కాంతుల్లో కోదండ రామాలయం

ఒంటిమిట్ట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : నేడు జరిగే సీతారాముల కల్యాణానికి ఏకశిలానగరం ముస్తాబైంది. కల్యాణవేదిక వద్ద భారీగా ఏర్పాట్లు చేశారు. కల్యాణవేదిక ముందుభాగంలో వీవీఐపీ గ్యాలరీ, వేదిక ముందు భాగంలో క్యూలైన్లు, ఆలయం వద్ద భారీగా చలువపందిళ్లు ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు విచ్చేస్తుండడంతో గట్టి బందోస్తును ఏర్పాటు చేశారు. అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు వీవీఐపీలకు గాని, భక్తులకు గాని కలగకుండా టీటీడీ అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు. ఆలయాన్ని, కల్యాణ వేదికను ఆకట్టుకునేలా విద్యుద్దీపాలంకరణ చేశారు. రామాలయం ప్రాంగణం మొత్తం రంగు రంగుల విద్యుద్దీపాలతో అయోధ్య ఒంటిమిట్టకు తరలి వచ్చినట్లుగా ఉంది. పుష్పాలంకరణ, విద్యుద్దీపాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ సముదాయం, కల్యాణవేదిక వద్ద అద్భుతమైన డ్రెస్ లైటింగ్‌లో ఏర్పాటు చేశారు. దేవాలయం కల్యాణవేదికను కలుపుతూ రహదారుల వద్ద వివిధ దేవతామూర్తులతో కూడిన 10 పెద్ద, 30 చిన్న విద్యుత్ కటౌట్‌లను ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకు కల్యాణాన్ని భక్తులు వీక్షించేందుకు వీలుగా ఆలయానికి సమీపంలో రెండు కల్యాణవేదిక ప్రాంతంలో 23 ఎల్‌ఈడీ స్ర్కీన్‌లను ఏర్పాటు చేశారు. కల్యాణవేదిక వద్ద భక్తులకు వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగించేందుకు ఎయిర్ కూలర్‌లను ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవ ఏర్పాట్లను గురువారం టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ అశోక్ కుమార్, జేఈవో వీరబ్రహ్మం పరిశీలించారు. సీతారాముల కల్యాణం ఉత్సవానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు వారు తెలిపారు.

గరుడ వాహనంపై జానకిరాముడు దర్శనం

ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన గురువారం శ్రీరామచంద్రుడు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం శ్రీరామచంద్రుడు మోహిని అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ ఊరేగింపుల్లో భక్తులు దారి పొడవునా కోలాటాలు, చెక్కభజనలు చేశారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు సమర్పించి దర్శించుకున్నారు.

రాములోరి కల్యాణానికి కోటి తలంబ్రాలు

శుక్రవారం జరగనున్న సీతారాముల కల్యాణోత్సవానికి భక్తులు గోటితో వలచిన కోటి తలంబ్రాలను ఆలయ అధికారులకు అందజేశారు. శుక్రవారం తూర్పు గోదావరి జిల్లా కోరుకొండకు చెందిన శ్రీకృష్ణ చైతన్య సంఘం అధ్యక్షులు కల్యాణ అప్పారావు ఆధ్వర్యంలో 120 కిలోల గోటితో వలచిన కోటి తలంబ్రాలను టీటీడీ అధికారులు హనుమంతయ్య, శ్రావణకుమార్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు నవీన్, అర్చకులు వీరరాఘవాచార్యులు, శ్రావణ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు

కల్యాణానికి వేదిక సిద్ధం

- టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు

శుక్రవారం సాయంత్రం జరగనున్న సీతారాముల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. గురువారం టీటీడీ పరిపాలనా భవనంలో టీటీడీ ఈవో శ్యామలరావు, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేఈవో వీరబ్రహ్మం, జేసీ అదితిసింగ్, సీవీఎస్‌వో హర్షవర్ధన్‌రాజుతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ ఛైర్మన్ మాట్లాడుతూ కల్యాణోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పట్టు వస్త్రాలు సమర్పిస్తారన్నారు. కల్యాణవేదిక వద్ద 147 గ్యాలరీల్లో 60 వేల మంది సౌకర్యంగా స్వామి వారి కల్యాణాన్ని వీక్షించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కల్యాణవేదిక ప్రారంభంలోనే తలంబ్రాల పంపిణీ కోసం తొలిసారి ప్రత్యేకంగా 28 కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. కల్యాణోత్సవానికి సుమారు 2500 మంది పోలీసు సిబ్బంది, 400 మంది టీటీడీ విజిలెన్స్ సిబ్బందిని నియమించామన్నారు. సుమారు 3 లక్షల తాగునీటి బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లను అందిస్తున్నామన్నారు. కల్యాణవేదిక, ఆలయ పరిసర ప్రాంతాల్లో 12 టన్నుల సంప్రదాయ పుష్పాలు, లక్ష కట్ల ఫ్లవర్స్‌తో పుష్పాలంకరణ చేస్తున్నామన్నారు. సీతారాముల కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని ఆయన తెలిపారు.

దేశంలోనే విభిన్నం...

కోదండరాముని కల్యాణం

- నేడే ఒంటిమిట్ట కోదండరాముడి కల్యాణం
- పండు వెన్నెల్లో నెలరాజు చూస్తుండగా...
- కనీవిని ఎరుగని రీతిలో ఏర్పాట్లు

కల్యాణము చూతము రారండి...
శ్రీ సీతారాముల కల్యాణము చూతము రారండి...
చూచువారలకు చూడముచ్చటట
పుణ్య పురుషులకు ధన్య భాగ్యమట
భక్తి యుక్తులకు ముక్తి ప్రదమట
సురులను మునులను చూడవచ్చునట
కల్యాణము చూతము రారండి...
శ్రీ సీతారాముల కల్యాణము చూతము రారండి

వివరాలు 6లో


కల్యాణం జరిగే రోజున కోదండరాముని కోవెలపై నిండు పౌర్ణమి రోజు తొంగి చూస్తున్న నెలరాజు (ఫైల్)

దేశంలోనే విభిన్నం...



కల్యాణ వేదిక వద్ద ఏర్పాటు చేసిన ఆర్చిలు

కోదండరాముని కల్యాణం



విద్యుత్ కాంతులతో వెలుగొందుతున్న ఒంటిమిట్ట ఆలయం

- పండు వెన్నెల్లో నెలరాజు చూస్తుండగా...
- పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు
- కనీవిని ఎరుగని రీతిలో ఏర్పాట్లు
- నేడే కోదండరాముడి కల్యాణం

రాజంపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరాముని కల్యాణం శుక్రవారం రాత్రి జరగనుంది. కల్యాణోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం, తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కనీవిని ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేశారు. కల్యాణోత్సవ వైభవాన్ని ప్రపంచవ్యాప్తంగా శ్రీరామ భక్తులు తిలకించడానికి టీటీడీ ఎస్వీబీసీ ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. ఈ సందర్భంగా ఆంధ్ర భద్రాద్రి ఒంటిమిట్ట కోదండరాముని కల్యాణోత్సవం నెలరాజు పండు వెన్నెల్లో నిండు పౌర్ణమి రాత్రిలో జరగడం దేశంలోనే విభిన్నం. దేశంలోని అన్ని రామాలయాల్లో పగటిపూటే సీతారాముల కల్యాణం జరుగుతుండగా ఒంటిమిట్ట కోదండరాముని కల్యాణం మాత్రం రాత్రి నిండు పున్నమి వెన్నెల్లో జరగడం ఓ ప్రత్యేకత. ఈ కల్యాణోత్సవానికి ఎంతో ఆధ్యాత్మిక నేపథ్యం ఉంది. ఈ నేపథ్యంపై భక్తులు వివిధ రకాలుగా చెప్పుకుంటూ ఉంటారు. రెండు కథనాలు ఈ కల్యాణోత్సవంపై వినిపిస్తూ ఉంటాయి. శ్రీరాముడు చైత్రశుద్ధ నవమి నాడు పునర్వసు నక్షత్రంలో జన్మించాడు. అందువల్ల ఆయన పరిణయ మహోత్సవాలు అయోధ్యలోనైనా.. భద్రాద్రిలోనైనా.. దేశవ్యాప్తంగా ఏ ఇతర ప్రసిద్ధ రామాలయ క్షేత్రాలలోనైనా నవమి నాడే అభిజిత్ లగ్నంలో పగటి పూట మాత్రమే జరపడం ఆనవాయితీ. అలాగే అన్ని ఆలయాల్లో చైత్రశుద్ధ పౌర్ణమి నుంచి ఉత్సవాలు మొదలై నవమి నాటి కల్యాణంతో ముగుస్తాయి. అయితే అందుకు భిన్నంగా అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీరామచంద్రుడు, మహాలక్ష్మీ స్వరూపిణి సీతమ్మను పరిణయమాడే మహత్తర ఉత్సవం చైత్రశుద్ధ చతుర్ధశినాటి రాత్రివేళ నిర్వహించడం ఏకశిలా నగరి ఒంటిమిట్టకు మాత్రమే ప్రత్యేకత.



కల్యాణోత్సవం వేదిక వద్ద ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

బుక్కరాయల కాలం నుంచి...

ఈ సంప్రదాయం నిన్న.. మొన్న.. నేటిది కాదు. క్రీ.శ.1356లో బుక్కరాయల కాలం నాటి నుంచి ఇలాగే కొనసాగుతోంది. అమృతం కోసం రాక్షసులు.. దేవతలు సముద్రాన్ని చిలికారు. అప్పుడు హాలాహలంతో పాటు కల్పవృక్షం, ఉచ్చైశ్రవం, శంఖం.. ఇలా మరెన్నో పుట్టాయి. అమృతం కంటే ముందు శ్రీమహాలక్ష్మీ పుట్టింది. చంద్రుడు పుట్టాడు. శ్రీమహాలక్ష్మీ మహావిష్ణువుకు ఇల్లాలు కాగా.. చంద్రుడు ఆమెకు తోబుట్టువయ్యాడు. కాగా భూలోకంలో బాలరాముడికి గోరుముద్దలు తినిపించాలంటే చంద్రశాలపైకి కౌశల్య తీసుకెళ్లాల్సిందే. చంద్రుడు కనిపించి సరదాలు తీరిస్తే కానీ బాలరామయ్యకు ముద్దదిగదు. సూర్యవంశస్థుడైన శ్రీరాముడు తేజం, వెన్నెల, ప్రసన్నత, చల్లదనం, ప్రతాపం కలిగి ప్రజలను చక్కగా పాలించే శ్రీరామచంద్రుడయ్యాడు. తన పేరు శ్రీరామునికి తోడైనందుకు చంద్రుడు ఆనందించాడు. దేశమంతా జరిగే శ్రీరామ బ్రహ్మోత్సవాల్లో శ్రీరాముని కల్యాణం చూసే అవకాశం చంద్రునికి లేకుండాపోయింది. సీతారామచంద్రుల కల్యాణం అనే పేరే కానీ ఎక్కడా చంద్రునికి ఆహ్వానం లేదు. చంద్రుడు ఈ బాధను భరించలేకపోయాడు. బ్రహ్మోత్సవాలలో అధినాయకుడైన బ్రహ్మకు తన ఆవేదనను నివేదించుకున్నాడు. బ్రహ్మ అందుకు తగిన ఏర్పాట్లు చేస్తానని మాట ఇచ్చి ఒంటిమిట్టలో శ్రీరామ బ్రహ్మోత్సవాల్లో చతుర్ధశ నాటి రాత్రి వివాహ మహోత్సవం జరిగేలా అవకాశం కల్పించాడు. కళా పూర్ణుడైన చంద్రుడు సీతారామకల్యాణాన్ని పరమానందంతో తిలకిస్తాడు.

ఇంకో కథనం.. :

ఒంటిమిట్టలో శ్రీరామ కల్యాణం తిలకించే ఏర్పాటు చేసింది శ్రీమహావిష్ణువు అని కూడా ఓ కథనం. త్రేతాయుగంలో శ్రీరాముడు పునర్వసు నక్షత్రంలో పగటిపూట జన్మించాడు. సకల దేవతలు నేల మీద అవతరించి స్వామిని దర్శించి పుష్పవృష్టి కురిపించారు. మహర్షులు ఆశీర్వదించారు. పగటివేల జననం కారణంగా చంద్రుడు ఆ సన్నివేశం చూడలేకపోయాడు. శ్రీమహావిష్ణువు ద్వాపర యుగంలో శ్రీ కృష్ణభగవానుడిగా రాత్రిపూట జన్మించాడు. చంద్రుడు శ్రీకృష్ణజననం చూడగలిగాడు. అయినా శ్రీరామ కల్యాణం చూడలేకపోతున్నాననే చంద్రుని వేదనను శ్రీమహావిష్ణువు ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలతో తీర్చాడు. ఈ రెండు ఇతిహాసాలను కొట్టిపారేయడం అంతసులభం కాదు.

చారిత్రక నేపథ్యం

క్రీ.శ.. 1356లో బుక్కరాయలు ఒంటిమిట్ట శ్రీరామ బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. రామాయణంలో శ్రీరామ చంద్రుడి కల్యాణ నక్షత్రం ఉత్తర ఫాల్గుణినందున అందువల్ల ఆ నక్షత్రానికే ఒంటిమిట్టలో వివాహం జరిపించే నిర్ణయం తీసుకున్నారు. అయితే ఒంటిమిట్టలోని తొలి కల్యాణ మహోత్సవానికి ఉత్తర ఫల్గుణీ నక్షత్రం రాత్రిపూట వచ్చి ఉంటుంది. రాత్రిపూట వివాహం జరగవచ్చునా..? లగ్నశుద్ధ సప్తమి శుద్ధ చూసుకొని వివాహ మహోత్సవాన్ని కాలం నిర్ణయించింది. ఇది శాస్త్ర నిషిద్ధం కాదు. ఆ విధంగా బుక్కరాయలు రాత్రిపూటే తొలి సీతారాముల కల్యాణ మహోత్సవం జరిపించారు. మరో కథనం ప్రకారం.. బుక్కరాయులు చంద్రవంశీయుడు. యాధృచ్ఛికరంగా మొదటి తిరుణాలలో రాముల వారి కల్యాణం రాత్రి సమయంలో వచ్చింది. తమ వంశ మూల పురుషుడు చంద్రుడు చూస్తూ ఆనందిస్తుండగా శ్రీరామ చంద్రుని కల్యాణం జరిపించిన సంతోషం బుక్కరాయల్లో కలిగి ఉంటుంది. దీంతో జగదభిరాముడికి కల్యాణం ఒంటిమిట్టలో రాత్రి పూటే జరుగుతుంది. ఇంతటి విశిష్టత, ప్రత్యేకత కలిగిన ఒంటిమిట్టలో జగదభిరాముడి కల్యాణాన్ని చైత్రశుద్ధ చతుర్ధశి నాటి రాత్రివేళ నెలరాజుతో పాటు వీక్షించి మనం ధన్యులమవుదాం.

పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు

కోదండరాముని కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఇతర మంత్రులు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావులతో పాటు రాష్ట్ర దేవదాయశాఖ ఉన్నతాధికారులు, టీటీడీ ఉన్నతాధికారులు, ఆగమ శాస్త్ర పండితులు, కడప జిల్లా కలెక్టర్‌తో పాటు అనేక మంది ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం కడప జిల్లా యంత్రాంగంతో కలిసి కల్యాణోత్సవానికి భారీ ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా కల్యాణ ప్రాంగణాన్ని కనీవిని ఎరుగని రీతిలో దేశ, విదేశాల్లో లభించే అరుదైన పుష్పాలతో అందంగా అలంకరించి దేవతామూర్తులతో కలిపిన విద్యుద్దీపాలను భారీ ఎత్తున అలంకరించారు. కల్యాణోత్సవానికి ఒంటిమిట్టను మరో వైకుంఠంగా తీర్చిదిద్దారు.

అశ్వ వాహనంపై పట్టాభిరాముడి వైభవం..

- వేడుకగా పార్వేట ఉత్సవం



ఊంజల్‌సేవలో శ్రీరాముడు, (ఇన్‌సెట్లో) అశ్వవాహనంపై పట్టాభిరాముడు

వాల్మీకిపురం, ఏప్రిల్ 10: వాల్మీకిపురం పట్టాభిరాముడి విశ్వావసునామ సంవత్సర సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం టీటీడీ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, తోమాలసేవలతో విశేష పూజలు జరిగాయి. భోగోత్సవ మూర్తులైన సీతారామలక్ష్మణులకు విశేష అలంకరణలతో తిరుచ్చిలో వేంచేపు చేసి తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయ మండపంలో యాగశాల వైదిక కార్యక్రమాలు సాగాయి. సాయంత్రం పట్టాభిరాముడికి ఊంజల్‌సేవ కన్నుల పండుగగా నిర్వహించారు. స్థానిక పార్వేట మండపం వద్ద ఉత్సవ వేడుకలు నిర్వహిస్తూ భక్తులకు విశిష్టతను తెలియజేశారు. అనంతరం రాత్రికి అశ్వ వాహనంపై పట్టాభిరాముని విశేషాలంకరణలతో అధిష్టింప చేసి పురవీధులలో నిర్వహించిన నగరోత్సవం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా కోలాటలు, చెక్క భజనలు, మహిళల చలిపిండి దీపారాధనలు, టీటీడీ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమాలలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ ముని బాల కుమార్, ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు, టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు, కృష్ణప్రసాద్‌భట్టార్, కృష్ణరాజు, సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, భాషికాచార్యులు, ధనుష్‌భట్టార్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు: పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం టీటీడీ ఆధ్వర్యంలో వసంతోత్సవం, చక్రస్నానం, రాత్రికి హంస వాహనంపై పట్టాభిరాముడి నగరోత్సవం, ధ్వజావరోహన కార్యక్రమాలు జరగనున్నాయి.

ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగిస్తే ఉపేక్షించం

- గ్యాంగ్‌వార్ కేసులో 9 మంది నిందితుల అరెస్ట్
- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించినా, అల్లర్లకు పాల్పడినా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు హెచ్చరించారు. రంజాన్ పండుగ సందర్భంగా ఇరువర్గాల మధ్య జరిగిన గ్యాంగ్ వార్ కేసులో నిందితులుగా ఉన్న 9 మందిని గురువారం రాయచోటి అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వివరాలను ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించే విధంగా ఎవరు ప్రవర్తించినా ఉపేక్షించమన్నారు. గత నెల 31న రంజాన్ పండుగ సందర్భంగా రాత్రి 11 గంటల సమయంలో రెండేళ్ల క్రితం అమ్మాయి విషయంలో పాత కక్షల కారణంగా సయ్యద్ నూరుల్లా అలియాస్ నూర్‌తో పాటు మరి కొంత మంది కలిసి దేశ్‌ముఖ్ ఇస్రాన్‌అలీఖాన్ వర్గంపై కట్టెలు, ఇనుప రాడ్లు, చైన్‌లతో దాడి చేసి ఇస్రాన్‌అలీఖాన్, రియాన్‌అలీఖాన్, అహ్మద్ బాషాలను తీవ్రంగా గాయపరిచారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రాయచోటి అర్బన్ సీఐ బి.వెంకటచలపతి, ఎస్ఐ జహీర్‌ల ఆధ్వర్యంలో పోలీసులు గురువారం గ్యాంగ్‌వార్ కేసులో నిందితులుగా ఉన్న రాయచోటి పట్టణంలోని కొత్తపల్లికి చెందిన సయ్యద్ నూరుల్లా అలియాస్ నూర్, సయ్యత్ బతుల్లా, షేక్. ఖదీర్‌అహ్మద్ అలియాస్ ఖాదర్, షేక్.సుహేల్ అలియాస్ గుర్రం, షేక్.మన్సూర్‌అలీ, షేక్.ఇర్ఫాన్, షేక్.ఫారూఖ్, షేక్.ఇర్ఫాన్, పఠాన్ రియాజ్ అలీఖాన్ అలియాస్ నాజుల్లాలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి దాడికి ఉపయోగించిన 5 కట్టెలు, 3 ఇనుప రాడ్లు, ఒక ఇనుప చైను, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా అల్లర్లకు పాల్పడే 100 మందిని గుర్తించామని, అందిరిపైనా రౌడీషీట్ ఓపెన్ చేస్తామని ఎస్పీ చెప్పారు. అలాగే లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినా, మైనర్లకు వాహనాలు ఇచ్చినా అటువంటి వారిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా అసాంఘీక కార్యకలాపాల నివారణ కోసం, ఆకతాయిల అల్లర్ల కట్టడి కోసం రూ.10 లక్షలతో జిల్లా వ్యాప్తంగా 300 సీసీ కెమెరాలు త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. పిల్లలను అదుపులో పెట్టుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. రాయచోటి పట్టణంలో ఎవరైనా గ్యాంగ్‌లుగా ఏర్పడి ప్రజా శాంతికి విఘాతం కలిగించే విధంగా ఘర్షణలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, అలాంటి వారు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి, రాయచోటి అర్బన్ సీఐ బీవీ చలపతి, ఎస్ఐ జహీర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు ఒంటిమిట్టకు రాక

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఈనెల 11వ తేదీ శుక్రవారం ఒంటిమిట్టకు రానున్నారు. సీతారాముల కల్యాణోత్సవ కార్యక్రమంలో పాల్గొని పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. విజయవాడలో మధ్యాహ్నం 3-35 గంటలకు విమానంలో బయలుదేరి 4-20 గంటలకు కడప విమానాశ్రయం చేరుకుంటారు. 4-30 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి సాయంత్రం 5 గంటలకు ఒంటిమిట్టలోని టీటీడీ అతిథి గృహానికి చేరుకుంటారు. 6-05 గంటల వరకు రిజర్వులో ఉంటారు. 6-10 గంటలకు కోదండరామ స్వామి ఆలయానికి చేరుకుంటారు. 6-15 నుంచి 6-30 గంటల వరకు స్వామి వారిని దర్శించుకొని పట్టువస్త్రాలు సమర్పిస్తారు. 6-35 గంటలకు కల్యాణ వేదిక వద్దకు చేరుకుని 8-30 గంటల వరకు సీతారాముల కల్యాణోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారు. 8-35 గంటలకు అక్కడ నుంచి బయలుదేరి 8-40 గంటలకు ఒంటిమిట్టలోని టీటీడీ అతిథి గృహానికి చేరుకుని రాత్రికి అక్కడే బస చేస్తారు. 12వ తేదీ ఉదయం 8-50 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 9-20 గంటలకు కడప విమానాశ్రయం చేరుకుంటారు. 9-30 గంటలకు ప్రత్యేక విమానంలో బయలుదేరి 10-15 గంటలకు విజయవాడ విమానాశ్రయం చేరుకుంటారు. 10-20 గంటలకు అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10-30 గంటలకు ఉండవల్లిలోని తన నివాస గృహం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. ఈ మేరకు జిల్లా కేంద్రానికి గురువారం ముఖ్యమంత్రి పర్యటన వివరాలు అందాయి.

పరిహారం చెల్లించకపోతే ఉరే శరణ్యం

- ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులు ఉరితాళ్లతో నిరసన

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రిజర్వాయర్ కోసం తీసుకున్న భూములకు నష్టపరిహారం చెల్లించకపోతే ఉరే శరణ్యమని ముదివేడు రిజర్వాయర్ నిర్వాసిత రైతులు వాపోయారు. గురువారం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఉరితాళ్ల మెడకు బిగించుకుని కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ గత ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించి ముదివేడు రిజర్వాయర్ కోసం భూములు లాక్కొంటే పరిహారం చెల్లించకుండా, పునరావాసం కల్పించకుండా కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. రైతుల భూములకు నష్టపరిహారం చెల్లించలేని పక్షంలో భూములు వెనక్కి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు శ్రీనివాసులు, రాజేశ్, వెంకటరెడ్డి, మారపరెడ్డి, తిమ్మారెడ్డి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 268 దేవాలయాలకు అర్చకుల ఏర్పాటు

రామాపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 268 దేవాలయాలకు అర్చకులను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా దేవాదాయశాఖ అధికారి విశ్వనాథ్ తెలిపారు. మండలంలోని గురువారం బండపల్లి, సూర్యనారాయణపురంలో శ్రీమల్లాలమ్మ తల్లి ఆలయం గువ్వలచెరువు, ఓబుల్‌రెడ్డిగారిపల్లె, యర్రమరెడ్డిగారిపల్లె, రాచపల్లి, వడ్డెపల్లి, పర్వతిరెడ్డిగారిపల్లె, నల్లగుట్టపల్లి, పాతపల్లి, కర్ణపువాండ్లపల్లె గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 268 దేవాలయాలకు ధూప, దీప నైవేద్యం కొరకు అర్చకులను ఏర్పాటు చేసుకొనేందుకు లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రతి గ్రామంలో ఉన్న దేవాలయాల్లో అర్చకులు సక్రమంగా పూజలు చేయకుండా ఉంటే అటువంటి వారిపైన గ్రామస్తులు ఫిర్యాదులు ఇస్తే వారిని వెంటనే తొలగిస్తామన్నారు. గుడిలో పూజలు, ధూపదీప నైవేద్యాలు చేసే అర్చకులకు ఒక్కొక్కరికి ప్రభుత్వం నుంచి రూ.10 వేలు వారికి వేతన రూపంలో అందిస్తారన్నారు. దేవాలయాల్లో అర్చకులను పరిశీలించడం అనంతరం ఈ నివేదికను పై అధికారులకు పంపిస్తామని తెలిపారు.

కడప స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా సుధాకర్

కడప క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కడప స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా ఎన్.సుధాకర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 1991 బ్యాచ్‌కు చెందిన ఈయన జిల్లాలోని పలు స్టేషన్లలో పనిచేశారు. ప్రస్తుతం వెయిటింగ్ లిస్టులో ఉన్న ఈయనకు పోస్టింగ్ ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ఒంటిమిట్ట కల్యాణం నేపథ్యంలో వాహనాల దారి మళ్లింపు

- ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్టలో ఈ నెల 11న శుక్రవారం జరగనున్న సీతారాముల కళ్యాణం నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ మళ్లించామని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనలో తెలియజేశారు. మళ్లింపు ఈ నెల 11న ఉదయం నుంచి 12న ఉదయం వరకు అమలులో ఉంటుందని తెలిపారు. ఈ కార్య క్రమం నిర్వహణ సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాతీయ రహదారి-716 మీదుగా వచ్చే భారీ వాహనా లను రేణిగుంట, రాజంపేట, కడప వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల ద్వారా ఇతర మార్గాల్లో వెళ్లేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



ట్రాఫిక్‌పై ఆంక్షలు విధిస్తున్న పోలీసులు

18 చోట్ల పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు

సీతారామ కల్యాణానికి రాజంపేట వైపు నుంచి వచ్చే భక్తులు టూవీలర్, ఫోర్ వీలర్ వాహనాలను సాలాబాద్ సమీపంలో 5 చోట్ల ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాల్లో క్రమబద్ధతిలో నిలపాలి. కల్యాణ వేదిక నుంచి కడప మార్గంలో 13 పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు.

వాహనాల దారి మళ్లింపు వివరాలు

కడప- తిరుపతి వైపు వెళ్లే వాహనాలు కడప నగరం ఆలంఖాన్‌పల్లె ఇర్కాన్ సర్కిల్ నుంచి ఊటుకూరు సర్కిల్, రాయచోటి మీదుగా తిరుపతి వెళ్లాలి. తిరుపతి నుంచి కడప వైపు వచ్చే వాహనాలు రాయచోటి మీదుగా కడపకు చేరుకోవాలి. రాజంపేట వైపు నుంచి కడపకు వెళ్లే భారీ వాహనాలను రాయచోటి మీదుగా దారి మళ్లించారు. అయితే ద్విచక్ర వాహనాలను సాలాబాద్ నుంచి ఇబ్రహీంపేట, మాదవరం మీదుగా పంపేందుకు పోలీసులు ఏర్పాటు చేశారు.

కడప వైపు పార్కింగ్ ప్రదేశాలు

ఒంటిమిట్టకు వచ్చే భక్తుల కోసం 13 ప్రదేశాల్లో పార్కింగ్ ఏర్పాటు చేశారు.

- ఫోర్‌వీలర్స్‌కు జనరల్ పార్కింగ్ చలమయ్య యాదవ్ సైట్, మాధవరం-1 (హెచ్‌పీ పెట్రోలు బంకు తూర్పు వైపున).
- త్రీవీలర్స్‌కు కనకదుర్గ కళ్యాణమండపానికి పడమటి వైపున మాధవరం -1 వద్ద.
- కనకదుర్గ కల్యాణ మండపం తూర్పు వైపున - మాధవరం-1, సన్నీ ఫుడ్ కోర్టు ఫ్యామిలీ దాబా తూర్పు వైపు, పడమటి వైపున, పీహెచ్‌సీ కొత్తమాధవరం (ఫారెస్టు చెక్‌పోస్టు ఎదురుగా) కార్ల పార్కింగ్ ఏర్పాటు చేశారు.
- ఆర్టీసీ బస్సులకు శ్రీ షిర్డీసాయి డిగ్రీ కళాశాల, ఓబుల్‌రెడ్డి వాటర్ ప్లాంటు / స్పైసెస్ బోర్డు మధ్యలో పార్కింగ్ ఇచ్చారు.
- ఉచిత బస్సులు, వీఐపీ కారు పార్కింగ్.. శ్రీషిర్డీసాయి డిగ్రీ కళాశాల, రాయలసీమ హోటల్ (వీవీఐపీ అండ్ వీఐపీ ఎంట్రెన్స్ ఆర్చి ఎదురుగా).
- పోలీసు వాహనాలకు ఇండియన్ ఆయిల్ పెట్రోలు బంకు, మయూన హోటల్ వెనక వైపున. టీటీడీ వాహనాల పార్కింగ్ కళ్యాణవేదిక ప్రధాన ప్రవేశం ఆర్చి వద్ద ఉన్న సత్రం వద్ద.
- ఇతర శాఖల వాహనాల పార్కింగ్ ఈద్గా పక్కన, ఒంటిమిట్ట (కారు పార్కింగ్)
- టూవీలర్, కారు పార్కింగ్.. కల్యాణ రామ టౌన్‌షిప్ అండ్ బ్రిడ్జి పక్కన, దర్జిపల్లి రోడ్డు, కొత్తపల్లి గ్రామ సమీపంలో.

రాజంపేట వైపు పార్కింగ్ ప్రదేశాలు

- ఆర్టీసీ బస్సు పార్కింగ్.. సాలాబాద్ క్రాస్ వద్ద.
- ఫోర్‌వీలర్, టూవీలర్ పార్కింగ్.. మదరసా, మలకాటిపల్లె గ్రామం.
- వీఐపీ కారు పార్కింగ్.. బీసీ బాయ్స్ హాస్టల్, దుర్గమ్మ గుడి ముందు వైపు, ఒంటిమిట్ట టౌన్.

పోలీసుశాఖకు వాహనదారులు సహకరించాలి

- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు సూచన

రాయచోటిటౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఒంటిమిట్ట కోదండ రామాలయంలో శుక్రవారం జరగనున్న సీతారాముల కల్యాణం నేపథ్యంలో ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కడప- రేణిగుంట రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒంటిమిట్ట కోదండరామస్వామి కల్యాణం సందర్భంగా ఈ నెల 11న శుక్రవారం ఉదయం 10 నుంచి 12వ తేది శనివారం మధ్యాహ్నం 2 గంటల వరకు ట్రాఫిక్ దారి మళ్లింపు ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. భక్తుల వాహనాలు మినహా ఎలాంటి ఇతర వాహనాలు అనుమతించరని ఆయన తెలిపారు.

దారి మళ్లింపు వివరాలు

కడప నుంచి తిరుపతి వైపు వెళ్లే వాహనాలు కడప నగరం ఊటుకూరు సర్కిల్ నుంచి వయా గువ్వలచెరువు, రాయచోటి మీదుగా తిరుపతి వెళ్లాలన్నారు. అలాగే తిరుపతి నుంచి కడప వైపు వెళ్లే అన్ని వాహనాలు తిరుపతి నుంచి వయా భాకరాపేట, పీలేరు, రాయచోటి మీదుగా కడపకు చేరుకోవాలన్నారు. అలాగే రైల్వేకోడూరు, రాజంపేట వైపు నుంచి కడపకు వెళ్లే వాహనాలు రాజంపేట నుంచి రాయచోటి మీదుగా కడపకు చేరుకునే విధంగా దారి మళ్లింపు చేసినట్లు ఎస్పీ తెలియజేశారు. ఈ ట్రాఫిక్ దారి మళ్లింపు విషయాన్ని వాహనదారులు గమనించాలన్నారు. ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీస్ శాఖకు సహకరించాలని తెలిపారు. ఒంటిమిట్ట కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు.

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. అభివృద్ధి శూన్యం

- జీర్ణోద్ధరణకు నోచుకోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం
- ఆలయ అభివృద్ధికి ప్రతిపాదనలు పంపిన పాలక మండలి



శిథిలమవుతున్న గాలిగోపురం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం. ఎంతో చరిత్ర గల ఆలయం. శ్రీరామ చంద్రుడు ప్రతిష్ఠించిన శివలింగం ఉండడంతో ఈ ప్రాంతానికి ముక్తిరామేశ్వరమని పేరు వచ్చింది. మార్జాలరూపంలో ఉన్న రావణుడిని రాముడు బాణంతో వదించి ముక్తిని ప్రసాదించడంతో ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంగా పేరు పొందింది. ఇంతటి చారిత్రక ప్రాశస్త్యం ఉన్న ఆలయానికి మాన్యాలు, భూములు ఉన్నా... అభివృద్ధికినోచుకోక.. ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంటోందని లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఆలయ చరిత్ర

రావణ వధ అనంతరం తనకు ఆపాదితమైన బ్రహ్మహత్య దోష నివారణకు శ్రీరాముడు ఈ ప్రాంతంలో శివలింగాను ప్రతిష్ఠించాలని సంకల్పించారు. రాముని ఆజ్ఞతో ఆంజనేయుడు కాశీ నుంచి శివలింగం తీసుకురావడానికి వెళ్లాడు. ముహూర్త సమయానికి ఆంజనేయుడు రాకపోవడంతో శ్రీరాముడు సైకత లింగను ప్రతిష్ఠించారు. సైకత లింగంపై శ్రీరాముని వేలి ముద్రలు స్పష్టంగా కనిపిస్తాయి. ఆ తర్వాత వచ్చిన ఆంజనేయుడు తాను తెచ్చిన శివలింగాన్ని ప్రతిష్ఠించాలని పట్టుబట్టడంతో సైకత లింగానికి కొంత దూరంలో ప్రతిష్ఠించారు. ఆ గుడి నేడు ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం, హనుమత్ లింగేశ్వరస్వామి ఆలయాలుగా ప్రసిద్ధి పొందాయి. ఆలయంలో ఎత్తైన ప్రాకారంతో అయిదు అంతస్తుల గాలిగోపురంతో అలరాడుతోంది.



రోడ్ల విస్తరణతో తగ్గిపోయిన ఆలయం

> **అనుమతి రాగానే పనులు చేపడుతాం**
>
> ఆలయ అభివృద్ధి కోసం భక్తుల ద్వారా 20 శాతం విరాళాలు రాబట్టి ప్రభుత్వానికి పంపుతాం. ప్రభుత్వం 80 శాతం సీజీఎఫ్ నిధులను మంజూరు చేస్తుంది. ఆలయ జీర్ణోద్ధరణకు సంబంధించిన పనులను స్థపతి పరమేశ్వరప్ప పరిశీలించారు. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే.. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సహకారంతో మూడు నాలుగు నెలల్లో ఆలయ అభివృద్ధి పనులను చేపడుతాం.
>
> - మార్తల రాజారెడ్డి, ఆలయ చైర్మన్



శిథిలమైన ఆలయ ప్రాకారం

దెబ్బతిన్న గాలిగోపురం

ఆలయ గాలిగోపురం పై భాగం దెబ్బతింది. ఆలయం చుట్టూ ఉన్న ప్రాకారం శిథిలమవుతోంది. ఆలయం చుట్టూ రోడ్లు విస్తరించడంతో ఆలయం తగ్గుగా మారి వర్షం వచ్చినప్పుడు భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఆలయ అభివృద్ధి కోసం పాలక మండలి ఆధ్వర్యంలో రూ.5 కోట్లతో ప్రభుత్వానికి రెండేళ్ల క్రితం ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం మారిపోవడంతో ఆ ప్రతిపాదనలను పక్కనబెట్టారు. ప్రస్తుతం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సహకారంతో గాలిగోపురం పునర్నిర్మాణం, ఉత్తరం వైపున మూడు అంతస్థులతో కొత్తగా గాలిగోపురం నిర్మాణం, నూతన ప్రహరీ ఏర్పాటు, 12 అడుగుల ఎత్తులో ప్రాకార మండపాల పునర్నిర్మాణ పనులు చేపట్టాలని ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

డైట్ కళాశాలలో ఐసీటీ ల్యాబ్ ప్రారంభం

రాయచోటిటౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని డైట్ కళాశాలలో ఆధునిక సాంకేతికతకు తోడ్పాటుగా ఐసీటీ కంప్యూటర్ ల్యాబ్‌ను గురువారం రిటైర్డ్ అడిషినల్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వీరభద్రారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరభద్రారెడ్డి మాట్లాడుతూ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు, వీడియోలు, అనిమేషన్‌ల ద్వారా పాఠాలను ఆసక్తికరంగా బోధించవచ్చునన్నారు. గణితశాస్త్రం, భౌగోళికం వంటి విషయాల్లో విజువల్ డెమోన్‌స్ట్రేషన్లు అందించడం సులభతరం అన్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం మాట్లాడుతూ ఇంటరాక్టీవ్ లెర్నింగ్ టూల్స్ (ఆప్‌లు, గేమ్స్, క్విజ్‌లు) ద్వారా విద్యార్థుల ఆసక్తి పెరుగుతుందన్నారు. అనంతరం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ డిజిటల్ టెస్టులు, ఈ-పుస్తకాలు, సిమ్యులేషన్ల ద్వారా అభ్యాసాన్ని మెరుగుపరచవచ్చునన్నారు. విద్యార్థుల ప్రగతిని ఆన్‌లైన్ ద్వారా గుర్తించి వారికి సరైన మార్గనిర్దేశనం చేయవచ్చునని తెలిపారు. ఐసీటీ లెక్చరర్ అసదుల్లా, కళాశాల అధ్యాపకుల శివభాస్కర్, రెడ్డెప్పరెడ్డి, జాఫర్, రెడ్డెయ్య, నాగేశ్వరావు పాల్గొన్నారు.

ప్రతి శాఖ విజన్, మిషన్ కలిగి ఉండాలి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో మనం ఉన్నంతంగా ఉండేందుకు నిర్ణయించుకున్న దీర్ఘకాలిక లక్ష్యాలు (విజన్), ఆ లక్ష్యాల సాధనకు మనం అనుసరించే విధానాలను (మిషన్) ప్రతిశాఖ రూపొందించుకుని వాటిని సాధించే క్రతువలో నిమగ్నం కావాలని వైవీయూ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాస రావు స్పష్టం చేశారు. గురువారం వైస్ చాన్సలర్ శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎకనామిక్స్ ఇంగ్లీషు, తెలుగు, బయోకెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, జెనెటిక్స్ అండ్ జినోమిక్స్ డిపార్ట్ మెంట్ల శాఖల విభాగాధిపతులు పవర్‌పాయింట్ ప్రజెంటే షన్ ద్వారా వారి వారి విభాగాల అభివృద్ధి గురించి వివరించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు విశ్వ విద్యాలయంలో ఎక్కువ శాతం చదువుతున్నారని వారికి కమ్యూని కేషన్స్ స్కిల్స్, ఆంగ్లభాషలో ప్రావీణ్యత ఉండేలా నిర్ణయాలు తీసు కోవాలన్నారు. ఉప కులపతి వెంట ప్రిన్సిపల్ ప్రొఫెసరు రఘు నాథరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసరు పద్మ ఉన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలి : కలెక్టర్

బి.కొత్తకోట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగి రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాల్సిందేనని, ఇందులో ఎవరికీ మినహాయింపు లేదని కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. గురువారం బి.కొత్తకోటలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తొలుత తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ రీసర్వే, ఫ్రీహోల్డ్ భూములు, పొజిషన్ సర్టిఫికెట్లపై సమీక్షించారు. ఫ్రీహోల్డ్ భూములు, హౌసింగ్ రీవెరిఫికేషన్‌లో వెనుకబడిన అధికారులకు అక్షింతలు వేశారు. అనంతరం ఉద్యానవనశాఖ, హౌసింగ్ శాఖ అధికారులతో సమావేశమై ఆయా శాఖల పురోగతి, పనితీరును పరిశీలించారు. మండలంలో ఎంత విస్తీర్ణంలో ఏపీ వ్యవసాయ పంటలు సాగవుతున్నాయి, కాలపరిమితి, దిగుబడి, చీడపీడల నివారణ తదితర అంశాలపై చర్చించారు. హౌసింగ్ పట్టాల రీవెరిఫికేషన్‌లో అనర్హుల గుర్తింపులో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు.

మండల శివారులో సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్ ఆధ్వర్యంలో రైతు నగేష్‌బాబు చేపట్టిన రోజా పూలసాగు, సబ్సిడీ నిధులతో చేపట్టిన పాలీహౌస్ నిర్మాణాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రోజా పూల సాగుకు నిర్వహణ ఖర్చులు, మార్కెటింగ్, ఆదాయంపై అక్కడ పని చేస్తున్న కూలీలను అడిగి వివరాలను తెలుసుకున్నారు. బీరంగి గ్రామ పరిధిలో మల్చింగ్ పేపర్‌తో సాగు చేస్తున్న టమోటా, మిరప పంటలను పరిశీలించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని, రాయితీలను వినియోగించుకొని లబ్ధి పొందాలని కోరారు.

అనంతరం బీరంగి పంచాయతీ పరిధిలో ఓ రైతు సాగు చేస్తున్న టమోటా పంటపై ఆరా తీశారు. ఒక ఎకరం టమోటా సాగుకు అయ్యే ఖర్చు, యాజ మాన్య పద్ధతులు మార్కెటింగ్‌పై సంబంధిత రైతులతో చర్చించారు. కలెక్టర్ ఆకస్మిక పర్యటన సందర్భంగా సిబ్బంది హైరానా పడ్డారు. తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల సమీక్షలో సైతం మీడియాను అనుమతించకుండా రహస్యం పాటించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అజారుద్దీన్, ఎంపీడీవో దిలీప్‌కుమార్, సర్వేయర్ ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

చీటీల పేరుతో... రూ.7 కోట్లకు టోకరా

- పోరుమామిళ్లలో వైరల్‌గా మారిన సంఘటన
- ఆందోళనలో బాధితులు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల ప్రాంతంలో చీటీలు వేయడం.. పెద్ద మొత్తంలో డబ్బులు వసూళ్లు చేసి పత్తా లేకుండా పోవడం సర్వసాధారణమైంది. ఇటీవల ఓ వ్యక్తి రూ.20 కోట్లకు పైగా చీటీల పేరా టోకరా వేసి అందుబాటులో లేకపోవడంతో దాదాపు 150 మందికి పైగా బాధితులు పోలీసులను ఆశ్రయించడం, చివరికి ఆ వ్యక్తి కటకటాలపాలైన సంఘటన తెలిసిందే. ఇది మరవక ముందే పోరుమామిళ్లలో మరో వ్యక్తి రూ.7కోట్లుకు పైగా చీటీల పేరు వసూళ్లు చేసి గత నాలుగైదు రోజులుగా కనిపించకపోవడం, ఫోన్లకు సరైన సమాధానం ఇవ్వక పోవడంతో బాధితుల్లో ఆందోళన మొదలైంది.

పోరుమామిళ్లలోని లక్ష్మి వెంకటేశ్వరస్వామి గుడి సర్కిల్ పరిధిలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి గత మూడేళ్లుగా సన్నిహితులు, వ్యాపారస్తులతో చీటీల వ్యాపారం చేస్తూ అందరితో కలుపుగోలుగా ఉండేవారు. చీటీలు పూర్తయిన తరువాత మళ్లీ వాటిని రెట్టింపు చేసేవాడని సమాచారం. ఇతను ఒక్కసారిగా కనిపించక పోవడంతో వ్యాపార దుకాణాల వద్ద, ఇళ్లవద్ద చర్చ సాగుతోంది. అమ్మవారిశాలవీధిలోనే ఒకే కుటుంబంలో వారికి లక్షల రూపాయలు బాకీ ఉన్నాడని సమాచారం. ఎలక్ట్రికల్ దుకాణం నిర్వహించుకునే ఓ వ్యక్తికి రూ.9 లక్షలు, కలసపాడులో కూడా ఓ వ్యక్తికి రూ.28లక్షలు, పోరుమామిళ్లలోని పొట్టిశ్రీరాములు విగ్రహం సమీపంలో నివాసం ఉంటున్న వ్యక్తికి లక్షల రూపాయల్లో బాకీ ఉన్నట్లు సమాచారం. దాదాపు 70 మందికి పైగా ఒకరికి తెలియకుండా మరొకరికి చీటీలు వేస్తూ.. అప్పులు చేస్తూ టోకరా పెట్టినట్లు సమాచారం. ఇటీవల కంటి ఆపరేషన్ అని చెప్పి వెళ్లిన ఆ వ్యక్తి పోరుమామిళ్లలో కనపడకపోవడంతో చీటీలు వేసిన వారితో పాటు అప్పులు ఇచ్చిన వారిలో సందేహాలు తలెత్తాయి. ఈ సంఘటనపై పోరుమామిళ్లలో రకరకాలుగా చర్చించుకుంటున్నారు. చీటీల డబ్బుతో బంగారు కొనుగోలు చేశాడని, దాదాపు కోటి వరకు డబ్బులతో వెళ్లిపోయాడని, ఇప్పుడు పోరుమామిళ్లకు వచ్చే పరిస్థితి లేదనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇక కొందరు అయితే ఐపీ దాఖలు చేస్తాడా, ఎవరికైనా నోటీసులు పంపిస్తాడా అన్న అనుమానాలు కూడా వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పోరుమామిళ్ల ఎస్ఐ ఆర్‌వీ కొండారెడ్డిని వివరణ కోరగా చీటీల పరంగా తమకు ఎవరు ఫిర్యాదు చేయలేదన్నారు.

రాజకీయ కారణాలతోనే అగస్టిన్ రాజు తొలగింపు

- ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు క్యాంప్‌బెల్ వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ అగస్టిన్‌రాజు రాజకీయాలు చేయడంతోనే బిషఫ్ ఆయనపై తొలగింపు వేటు వేశారని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం జమ్మలమడుగు క్యాంప్‌బెల్ వైద్యశాలను ఎమ్మెల్యే సందర్శించారు. ముందుగా కొత్తగా నియమించిన మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కేపీ రవీంద్రను కలిసి అభినందనలు తెలియజేశారు. ప్రజల కోసం, పేద రోగుల కోసం పనిచేయాలని సూచించారు. కాగా, అగస్టిన్‌రాజు తొల గింపును నిరశిస్తూ.. ఆయననే సూపరింటెండెంట్‌గా తిరిగి నియమించాలని వైద్య సిబ్బంది కోరారు. ఇక సెంట్రల్ బోర్డు ప్రాసెస్ లేకుండానే అగస్టిన్‌రాజును తొలగించారంటూ ఆయన భార్య డాక్టర్ ప్రత్యూష ఎమ్మెల్యేకు తెలిపారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ.. క్యాంప్‌బెల్ ఆస్పత్రిలో మెడికల్ సూపరింటెండెంట్‌గా అగస్టిన్‌రాజు పనిచేస్తూ వైసీపీ తరుపున ఊరూరా ప్రచారం చేయడంతో బిషప్ తొల గించారన్నారు. ఆస్పత్రి విషయాల్లో రాజకీయం చేయాల్సిన అవసరం లేదన్నారు. పేద రోగులకు వైద్యం సక్రమంగా అందించడమే తమ లక్ష్యమన్నారు. అనంతరం రాష్ట్ర మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రామాజీ ఇమ్మానుయేల్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అగస్టిన్ రాజు రాజకీయ పార్టీ కండువా కప్పుకోవడంతోనే బిషఫ్ తొలగించారని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, గుర్రం ప్రతాప్‌రెడ్డి, సర్పంచు పుల్లారెడ్డి, చెన్నకేశవరెడ్డి, ధనుంజయ, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



క్యాంప్‌బెల్ వైద్యశాలలో డాక్టర్ ప్రత్యూషతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

కారును ఢీకొన్న టిప్పర్.. వ్యక్తి మృతి

మైదుకూరు రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని రాయప్పగారిపల్లె సమీపంలో కారు, టిప్పర్ ఢీకొనడంతో గురు వారం తెన్నేటి వీరబ్రహ్మా య్య (65) మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు నంద్యాల జిల్లా పెసరవాయి గ్రామా నికి చెందిన వీరబ్రహ్మాయ్య పౌరోహిత్యం చేసు కుంటూ జీవనం సాగించేవారు. సొంత పని నిమిత్తం మర్రి పాడుకు ఒక్కడే కారు నడుపుకుంటూ వెళుతుండగా, రోడ్డు పనుల నిమిత్తం తిరుగుతున్న టిప్పర్ రాయప్పగారి పల్లె వద్ద ఢీకొంది. దీంతో వీరబ్రహ్మాయ్యకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఆర్టీసీ బస్సు ఢీ.. స్కూటరిస్టు మృతి



చికిత్స పొందుతూ మృతి చెందిన గురునాథ్

జమ్మలమడుగు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల ఎదురుగా గురువారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు స్కూటర్‌ను ఢీకొనడంతో సిరివెళ్ల గురునాథ్ (20) మృతి చెందాడు. మండలంలోని గూడెం చెరువు గ్రామానికి చెందిన గురునాథ్ ద్విచక్ర వాహనంలో జమ్మలమడుగు వచ్చి తిరిగి ఇంటికి వెళుతున్నాడు. అదే సమయంలో ముద్దనూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గురునాథ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం ప్రొద్దుటూరుకు తరలించగా.. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రిపుల్ ఐటీ ఏవోకు ప్రతిభా అవార్డు



పెనుగొండ రవికుమార్

వేంపల్లె, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో పరిపాలన అధికారిగా పనిచేస్తున్న పెనుగొండ రవికుమార్‌కు అంబేడ్కర్ జాతీయ ప్రతిభా అవార్డు లభించింది. సౌత్ 1 ప్రైవేటు లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగయ్య ఆధ్వర్యంలో ఈ స్వచ్ఛంద సంస్థ అవార్డుకు ఎంపిక చేసింది. ట్రిపుల్ ఐటీలో సీఎస్‌సీ అసిస్టెంటు ప్రొఫెసరుగా 12 ఏళ్లుగా విధులు నిర్వహిస్తూ జపాన్‌లోని ఏఐజెడ్ యూనివర్శిటీలో పరిశోధనలు చేశారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా గుంటూరులోని విజ్ఞాన మందిర్‌లో ఈ అవార్డును అందుకోనున్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ కడప జిల్లాలో 17 కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాల్లో ఆరు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ నిత్యానందరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 7, 8, 9, 10 ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా శుక్రవారం లోపు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. దరఖాస్తులను ఏపీ కేజీబీవీ వెబ్‌సైట్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ వెబ్‌సైట్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే పరిశీలిస్తామని స్పష్టం చేశారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

సింహాద్రిపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలపనూరు గ్రామంలో వంగళ సుజోష్నా అనే మహిళ మెడ నుంచి బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. పోలీసుల వివరాల మేరకు... బలపనూరు గ్రామంలో ఆశావర్కర్‌గా పనిచేస్తున్న సుజోష్నా గురువారం విధులు ముగించుకుని స్వగ్రామమైన నక్కలపల్లికి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. గుర్తు తెలియని వ్యక్తులు బైకుపై వెంబడించి నక్కలపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో ఆమెను భయపెట్టి మెడలో ఉన్న 32 గ్రాముల బంగారు గొలుసును చోరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు.

గేటు వసూలు విషయమై ఘర్షణ

- ఇరువురిపై కేసు నమోదు

పులివెందుల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పరిధిలోని కదిరి రోడ్డులో గేటు వసూలు విషయమై లారీ డ్రైవర్లపై దాడికి దిగిన ఇరువు రిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మొలకలవేము లకు చెందిన లారీలు కదిరి రోడ్డులో ఆగి ఉన్నాయి. ఈ సమయంలో మున్సిపాలిటీ పరిధిలో ఆగివున్న వాహనాల గేటు వసూలు కోసం ఇరు వురు వ్యక్తులు లారీ డ్రైవర్ల వద్దకెళ్లి గేటు చెల్లించాలని కోరారు. దీంతో డబ్బులు లేవని, ఓనర్లు వస్తున్నారని, వారు రాగానే చెల్లిస్తామని తెలిపారు. ఆగ్రహించిన గేటు వసూలుదారులు మీకోసం మళ్లీ రావాలా అంటూ వారిపై దాడికి దిగారు. దీంతో డ్రైవర్లు పులివెందుల అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడి చేసిన వారిద్దరు ఎవరనేది పోలీసులు ధ్రువీకరించలేదు.

బధిర బాలికపై వృద్ధుడి లైంగికదాడి

- పోక్సో కేసు నమోదు

కలికిరి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒక దళితవాడకు చెందిన 15 ఏళ్ల బధిర బాలికపై లైంగికదాడి చేశాడంటూ ఓ వృద్ధుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. గుట్టపాలెం ప్రాంతానికి చెందిన గుండ్లూరు హరి (63) బుధవారం ఓ పాడుబడిన ఇంట్లో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు ఫిర్యాదు రావడంతో నిందితుడిని అరెస్టు చేసినట్లు కలికిరి పోలీసులు తెలిపారు. సమీపంలో నివసిస్తున్న వారు విషయం గమనించి తల్లిదండ్రులకు తెలియజేయడంతో వెలుగులోకి వచ్చిందని తెలిపారు. మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు, కలికిరి సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి గురువారం సాయంకాలం గ్రామంలోకి వెళ్లి విచారణ చేశారు.

గర్భిణిపై గృహహింస.. నలుగురిపై కేసు

కురబలకోట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గర్భిణీపై గృహహింసకు పాల్పడ్డారని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని చింతమాకులపల్లెకు చెందిన హరినాథరెడ్డి మదనపల్లె పట్టణం రామారావు కాలనీకి చెందిన పవిత్రను ఏడాది క్రితం వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం ఆమె గర్భిణి కాగా భర్త హరినాథరెడ్డి, అత్తమామలు సునీత, వెంకటరమణ, ఆడపడుచు పద్మావతమ్మలు గృహహింసకు పాల్పడ్డారు. దీంతో ఆమె పుట్టింటికి చేరుకుని తనకు జరిగిన అన్యాయంపై ముదివేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దిగుబడి ఆశాజనకం.. ధర పతనం

నిరాశ చెందుతున్న రైతులు

చాపాడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేసిన కొర్ర పంట దిగుబడి ఆశాజనకంగా ఉన్నా.. ధర మాత్రం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మార్చి నెలలో వెదురూరు, నరహరిపురం, రాజుపాళెం, తిప్పిరెడ్డిపల్లె, కుచ్చుపాప తదితర గ్రామాల పరిధిలో సుమారు 3 వేల ఎకరాల్లో కొర్రపంట సాగు చేశారు. ఒక ఎకరాకు రూ.10 వేల నుంచి 15 వేల వరకు పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం యంత్రాలతో పంటనుకోస్తున్నారు. నాలుగు రోజుల నుంచి కోత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఒక ఎకరాకు కొర్ర ధాన్యం 10 క్వింటాళ్ల నుంచి 13 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోందని రైతులు చెబుతున్నారు. మైదుకూరు, ప్రొద్దుటూరు ప్రాంతాలకు చెందిన వ్యాపారులు క్వింటాలు రూ.2,200లకు కొనుగోలు చేస్తున్నారు. దిగుబడి ఆశాజనకంగా ఉన్నప్పటికి ధర మాత్రం గిట్టుబాటు కావడం లేదంటున్నారు. గత ఏడాది క్వింటా రూ.3,300 ధర పలికింది. కానీ ఈ ఏడాది తక్కువ ధరకు వ్యాపారులు కొనుగోలు చేస్తుండడంతో రైతులు నిరాశ చెందుతున్నారు.



కొర్రపైరును కోత కోస్తున్న మిషన్

అర్హులందరికీ న్యాయం చేస్తాం: ఆర్డీవో

గాలివీడు, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): సోలార్ పవర్‌ప్లాంట్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన అర్హులందరికీ న్యాయం చేస్తామని ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. గురువారం గాలివీడు మండలంలో పర్యటించిన ఆయన తూముకుంట సోలార్ నిర్వాసితులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 మెగావాట్ల సోలార్ అదనపు పవర్ ప్లాంట్ నిర్మాణం కోసం 114 ఎకరాల భూమిని గుర్తించగా అందులో 57 ఎకరాలు ప్రభుత్వ స్థలం కాగా, 57 ఎకరాలు డీకేటీ, అనుభవంలో ఉన్నట్లుగా గుర్తించామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకు బాధితులకు నష్టపరిహారం అందిస్తామన్నారు. ఇందులో నిజమైన అర్హులు ఎవరైతే ఉంటారో వారందరికీ నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.


తూముకుంటలో సోలార్ ప్లాంట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

చెత్తాచెదారం డంపింగ్ యార్డులో మాత్రమే వేయాలి

చెత్తాచెదారం డంపింగ్ యార్డులో మాత్రమే వేయాలని ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. కుషావతినగర్‌కు చెందిన స్థానికులు ఆర్డీవోను కలిసి కుషావతి నది (చిన్నేరు)లో చెత్తాచెదారం వేయడంపై ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. చెత్తాచెదారం వేయడం వల్ల చుట్టుపక్కల నివాసం ఉంటున్న తాము అనారోగ్యం పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఆర్డీవో చెత్తాచెదారం డంపింగ్ కోసం కేటాయించిన స్థలంలో మాత్రమే వేసేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. చెత్త డంప్ కోసం కుంచిబండ వద్ద స్థలం కేటాయించామని పంచాయతీ వారు వినియోగించుకోవడం లేదని ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. దీంతో పంచాయతీ సిబ్బంది చెత్తను డంపింగ్ యార్డులో మాత్రమే వేసేలా చర్యలు తీసుకోవాలని డీపీవోకు ఫోన్ ద్వారా సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భాగ్యలత, ఆర్ఐ బాలాజీ, సర్వేయర్ మురళి పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

సంబేపల్లె, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు కళాశాల ప్రారంభించడానికి ముందే పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగు మొదలైన వస్తువులు గురువారం అందించినట్లు మోడల్ స్కూల్ ఫ్రెండ్స్ బాబు దిలీప్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ గతంలో ఉత్తర్వులు జారీ చేయడంతో అందులో భాగంగా తొలి విడతలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పన్నెండు పీఎంశ్రీ నోటు పుస్తకాలు విద్యార్థులకు పంపిణీ చేశారు.

రైల్వేకోడూరు నియోజకవర్గ అభివృద్ధిపై సీఎంతో కేకే


సీఎంకు వినతి పత్రం అందజేసిన కేకే చౌదరి

రైల్వేకోడూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు నియోజకవర్గ అభివృద్ధిపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడితో రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఛైర్మన్ కేకే చౌదరి గురువారం విజయవాడలో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గ్రామీణ పరిశ్రమలు స్థాపిస్తే చాలా మందికి ఉపాధి లభిస్తుందన్నారు. నియోజకవర్గంలో ఏయే పరిశ్రమలు స్థాపించాలనేది ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయినట్లు వివరించారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల్లో పరిశ్రమలు స్థాపించడానికి ప్రణాళిక తయారు చేస్తున్నామన్నారు.

ఉద్యాన వర్సిటీ అసోసియేట్‌కు సన్మానం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఇటీవల వెంకటరామన్నగూడెం ప్రధాన కార్యాలయంలో ఉద్యాన వర్సిటీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా ఎం.చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా శోడిశెట్టి వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీగా ఎస్. శివశంకర్, జాయింట్ సెక్రటరీగా సీహెచ్ మల్లికార్జున, ట్రెజరర్‌గా ఏ. నిరీక్షణ్‌రాజ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారందరూ అనంతరాజుపేట ఉద్యాన కళాశాలకు నాన్ టీచింగ్ ఉద్యోగులు కావడంతో గురువారం ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ శ్రీనివాసులను వారు సత్కరించారు. ఈ సందర్భంగా డీన్ మాట్లాడుతూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు.

సీఎం పర్యటన దృష్ట్యా పోలీసుల విస్తృత తనిఖీలు

సిద్దవటం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడప - చెన్నై జాతీయ రహదారి బాకరాపేట, శివునిపల్లె, బొగిడివారిపల్లె, చాముండేశ్వరిపేట, మాధవరం నేషనల్ హైవేరోడ్డు ఆనుకుని ఉన్న అనుమానాస్పద స్థలాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం ఒంటిమిట్ట సీతారాముల కల్యాణోత్సవ పర్యటన సందర్భంగా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాలతో పోలీసులు తనిఖీలు చేపట్టారు.

కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలోనే పలు అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా టీడీపీ సీనియర్ నాయకులు పున్నాటి వాసు దేవరెడ్డి ఆధ్వర్యంలో సిమెంటు రోడ్డు నిర్మాణాలను ప్రారంభించడం సంతోషకరమన్నారు. అనంతరం జీవీపురం, నూకనపల్లె గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఒంటిమిట్ట కోదండరాముని కల్యాణానికి ముందే

ప్రయాణికులకు ట్రాఫిక్ ఇక్కట్లు

● తిరుపతినుంచి కోడూరు, రాజంపేట, కడప వరకు ట్రాఫిక్ జామ్


నిలిచిపోయిన భారీ వాహనాలు

రాజంపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట కోదండరాముని కల్యాణోత్సవానికి సీఎం చంద్రబాబునాయుడు వస్తున్న సందర్భంగా ఒక్కరోజు ముందే గురువారం సాయంత్రం సీఎం కాన్వాయ్ ట్రయిల్ రన్ పేరిట ఏకంగా మూడు గంటల పాటు తిరుపతి నుంచి కడప వరకు ట్రాఫిక్‌ను జామ్ చేశారు. తిరుపతి, రాజంపేట, కోడూరు మీదుగా వస్తున్న అటు ఇటు వాహనాలను ఎక్కడికక్కడే నిలిపివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సీఎం ట్రయిల్ రన్‌పేరిట సీఎం కాన్వాయ్ అధికారులు, రాష్ట్ర జిల్లా పోలీసులు సు మారు 30 వాహనాల్లో ట్రయిల్‌రన్ చేయడంతో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు పూర్తిగా వాహనాలు నిలిపివేశారు.

గుడి సిద్దయ్యకు నివాళి


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రసాద్‌బాబు

చిన్నమండెం, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువగొట్టివీడు గుట్టకిందపల్లెలో సుగవాసి కుటుంబం వీరాభిమాని గుడి సిద్దయ్య మృతిచెందడంతో ఆయన మృతదేహానికి రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

జన్మించిన గ్రామానికి సాయం అందించాలి


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

నందలూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ తమకు ఉన్నంతలో జన్మించిన గ్రామానికి సాయం అందించాలని ఎన్ఆర్ఐ కేకేరెడ్డి అన్నారు. తాను అమెరికాలో ఉన్నప్పటికి మినరల్ వాటర్ కేంద్రాలతో పాటు దేవాలయాల నిర్మాణం పునరుద్దరణ చేప డుతున్నట్లు పేర్కొన్నారు. గురువారం మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ నాగిరెడ్డిపల్లె తోటపాలెంలో మన్నూరు రామలక్షుమ్మ, నారాయణరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మినరల్ వాటర్ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించారు. నిర్వాహకులు మద్దికేర ఓబులేశు, రాజంపేట రూరల్ సీఐ రమణ, నందలూరు ఇన్‌చార్జి ఎస్ఐ మోహన్ కుమార్‌గౌడ్, నారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, శివరామిరెడ్డి, కృష్ణారెడ్డి, జంబు రవి తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి పరీక్షలు

రాయచోటిటౌన్, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): డీఎల్ఎడ్ (2023-25 బ్యాచ్) విద్యార్థుల సెమిస్టర్-4 ఫైనల్ టీచింగ్ ప్రాక్టీస్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఒకే విడతలో నిర్వహించనున్నట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధింత కళాశాలల ఈ పరీక్షల నిర్వహణకు పూర్తి స్థాయిలో సన్నద్దంగా ఉండాలని సూచించారు.అలాగే విద్యార్థులు కూడా తమ సంబంధిత కళాశాలల నుండి పూర్తి సమాచారం తీసుకొని పరీక్షల్లో పాల్గొనాలని ఆయన తెలియజేశారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో మూడో స్థానం


అన్నమయ్య జిల్లా హాకీ విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న వైద్య, రోగ్యశాఖా మంత్రి సత్యకుమార్

రాయచోటిటౌన్, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా ధర్మవరంలో ఈ నెల 6వ తేదీ నుండి 9వ తేదీ వరకు జరిగిన 15వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ హాకీ పోటీల్లో రాయచోటి పట్టణంలోని రాజు హాకీ అకాడమీ క్రీడాకారులు మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు అన్నమయ్య జిల్లా హాకీ అకాడమీ సెక్రటరీ ఇడగొట్టు నాగేశ్వరరావు తెలిపారు. ధర్మవరంలో నా లుగు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో 26 జి ల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొనగా అందులో రాజు హాకీ అకాడమీ క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనపరిచి మూడో స్థానం కైవసం చేసుకుని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా బహుమతి ట్రోఫీని అందుకున్నారన్నారు.

యువత సమాజ సేవ కోసం స్కౌట్స్, గైడ్స్

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్10: యువత సమాజ సేవలో పాలుపంచుకోవడం కోసం భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ అనే సంస్థను ఏర్పాటు చేశామని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 24 మంది విద్యార్థులను స్కౌట్, గైడ్స్ విభాగానికి ఎంపిక చేసి శిక్షణ ఇచ్చామన్నారు.

కోడూరు దంపతులకు కర్ణాటక బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కోడూరు పట్టణానికి చెందిన ప్రముఖ ఇంటీరాయర్ డిజైనర్లు షేక్ మహమ్మద్ ఫర్ధీన్, ఆయన సతీమణి తస్మియా తాజ్ దంపతులకు కర్ణాటక బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డుతో సత్కరించారు. ఇంటీరియర్ డిజైనింగ్‌లో ప్రతిభ చూపడటంతో అవార్డును ప్రదానం చేశారు.

అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యం: మంత్రి

రామాపురం, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సుద్దమళ్ల గ్రామం పాత పంచాయతీ కార్యాలయం నుంచి ఎగువ దళితవాడకు రూ.16.80 లక్షలతో వేసిన సిమెంటు రోడ్డును ఆయన ప్రారంభించారు. గ్రామ ఉపసర్పంచ్ గడికోట కిరణ్‌కుమార్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మద్దిరేవుల రమేశ్‌రెడ్డి, టీడీపీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, చెన్నక్రిష్ణారెడ్డి, రెడ్డికుమార్, ఆగ్రో వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠలో మంత్రి

రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డితో కలిసి సుద్దమళ్ల గ్రామం చింతలవాండ్లపల్లెలో గురువారం శ్రీరామచంద్ర సీతాలక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్నారు. రామాపురం మండల ప్రజాప్రతినిధులు,


సిమెంటు రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

గ్రామ పెద్దలు, ప్రజలు మంత్రికి, మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డికి స్వాగత పలికి సన్మానించారు.

సర్పంచ్ ఇంటికి వెళ్లిన మండిపల్లి

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి భయ్యారెడ్డిగారిపల్లె సర్పంచ్ గడికోట కిరణ్‌కుమార్‌రెడ్డి ఆహ్వానం మేరకు ఆయన ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా మంత్రికి ప్రజలు పలు సమస్యలపై అర్జీలు సమర్పించారు. అక్కడే ఆయన సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వెంటనే పరిష్కరించాలని కోరారు.

రోడ్డు ఏర్పాటు చేయండి

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బి.యర్రగుడి, పాలెం గ్రామాలకు రోడ్డు ఏర్పాటు చేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని గురువారం ప్రజలు కోరారు. గురువారం పాలెంగొల్లపల్లిలో ఓ కార్యక్రమానికి హాజరైన మంత్రి ప్రజల వినతులను స్వీకరించారు. టీడీపీ మండల యువజన నాయకుడు యనమల మదన్ మోహన్, ఏఐసీసీ ఛైర్మన్ యర్రగుడి, చంద్రశేఖర్ రెడ్డ, కోనంపేట సర్పంచ్ లక్ష్మీనారాయణ, డాక్టర్ షఫీనాయక్, షేక్. ఆరీఫ్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

చిన్నమండెం, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తున్నట్లు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి ప్రజాదర్బార్ నిర్వహించారు. సమస్యలు పరిష్కరించారు.

14న అంబేడ్కర్ జయంతి వేడుకలు

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాయచోటిలోని శ్రీసాయి శుభ కల్యాణం మండపంలో ఈ నెల 14న అంబేడ్కర్ 135వ జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికార సంస్థ వారు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీకి సంబంధించిన ప్రజలు, ప్రజాప్రతినిధులు ఉదయం 10 గంటలకు వేడుకలు రావాలని కోరారు.

గ్యాంగ్ వార్లు, రౌడీషీటర్లకు పోలీసుల హెచ్చరిక


గొడవ జరిగిన ప్రాంతంలో నిందితులను విచారిస్తున్న పోలీసులు

రాయచోటిటౌన్, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే గ్యాంగ్‌లకు, రౌడీషీటర్లకు అన్నమయ్య జిల్లా రాయచోటి అర్బన్ పోలీసులు వినూత్న రీతిలో హెచ్చరికలు జారీ చేశారు. గత నెల 31వ తేదీన రంజాన్ పండుగ రోజున రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీలో గల శివాలయం చెక్ పోస్టు వద్ద రెండు గ్యాంగులు పెద్ద ఎత్తున కత్తులు, కట్టెలు, ఇనుప చైన్‌లతో దాడికి పాల్పడి ముగ్గురికి తీవ్రంగా గాయపరిచిన సంఘటన అందరికీ తెలిసిందే. ఆ దాడిలో నిందితులుగా ఉన్న 24 మందిలో గురువారం రాయచోటి అర్బన్ సీఐ వెంకలచలపతి ఎస్ఐ జవార్‌ల ఆధ్వర్యంలో పోలీసులు 9 మందిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపెట్టే క్రమంలో వారిని ఊరేగింపుగా గొడవ జరిగిన ప్రాంతానికి తీసుకెళ్లి నిందితుల ద్వారా నేరుగా తెలుసుకున్నారు. పోలీసులు మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎవరి పరిస్థితి అయినా ఇలాగే ఉంటుందని హెచ్చరికలు జారీ చేసినట్లు అయింది.

మంచినీటి సమస్యను పరిష్కరించండి

సిద్దవటం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పరపల్లె గ్రామంలో గత రెండు నెలలుగా తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని గురువారం ఉప్పరపల్లె గ్రామ మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలుమార్లు పంచాయతి అధికారులకు నీటి సమస్యను పరిష్కరించాలని విన్నవించినా పరిష్కారం కాలేదన్నారు. సంబంధిత అధికారులు నీటి సమస్యను పరిష్కరించాలన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే పంచాయతి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. తాగునీటి సమస్యపై పంచాయతి సెక్రటరి మనోహర్‌ను వివరణ కోరగా నీటి సమస్య ఉన్నది వాస్తవమేనన్నారు.

దేశంలోనే విభిన్నం...



కల్యాణ వేదిక వద్ద ఏర్పాట్లు చేసిన అర్చిలు

కోదండరాముని కల్యాణం



విద్యుత్ కాంతులతో వెలుగొందుతున్న ఒంటిమిట్ట ఆలయం

- పండు వెన్నెల్లో నెలరాజు చూస్తుండగా...
- పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు
- కనీవిని ఎరుగని రీతిలో ఏర్పాట్లు
- నేడే కోదండరాముడి కల్యాణం

రాజంపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరాముని కల్యాణం శుక్రవారం రాత్రి జరగనుంది. కల్యాణోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం, తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కనీవిని ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేశారు. కల్యాణోత్సవ వైభవాన్ని ప్రపంచవ్యాప్తంగా శ్రీరామ భక్తులు తిలకించడానికి టీటీడీ ఎస్వీబీసీ ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. ఈ సందర్భంగా ఆంధ్ర భద్రాద్రి ఒంటిమిట్ట కోదండరాముని కల్యాణోత్సవం నెలరాజు పండు వెన్నెల్లో నిండు పౌర్ణమి రాత్రిలో జరగడం దేశంలోనే విభిన్నం. దేశంలోని అన్ని రామాలయాల్లో పగటిపూటే సీతారాముల కల్యాణం జరుగుతుండగా ఒంటిమిట్ట కోదండరాముని కల్యాణం మాత్రం రాత్రి నిండు పున్నమి వెన్నెల్లో జరగడం ఓ ప్రత్యేకత. ఈ కల్యాణోత్సవానికి ఎంతో ఆధ్యాత్మిక నేపథ్యం ఉంది. ఈ నేపథ్యంపై భక్తులు వివిధ రకాలుగా చెప్పుకుంటూ ఉంటారు. రెండు కథనాలు ఈ కల్యాణోత్సవంపై వినిపిస్తూ ఉంటాయి. శ్రీరాముడు చైత్రశుద్ధ నవమి నాడు పునర్వసు నక్షత్రంలో జన్మించాడు. అందువల్ల ఆయన పరిణయ మహోత్సవాలు అయోధ్యలోనైనా.. భద్రాద్రిలోనైనా.. దేశవ్యాప్తంగా ఏ ఇతర ప్రసిద్ధ రామాలయ క్షేత్రాలలోనైనా నవమి నాడే అభిజిత్ లగ్నంలో పగటి పూట మాత్రమే జరపడం ఆనవాయితీ. అలాగే అన్ని ఆలయాల్లో చైత్రశుద్ధ పౌర్ణమి నుంచి ఉత్సవాలు మొదలై నవమి నాటి కల్యాణంతో ముగుస్తాయి. అయితే అందుకు భిన్నంగా అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీరామచంద్రుడు, మహాలక్ష్మీ స్వరూపిణి సీతమ్మను పరిణయమాడే మహత్తర ఉత్సవం చైత్రశుద్ధ చతుర్దశినాటి రాత్రివేళ నిర్వహించడం ఏకశిలా నగరి ఒంటిమిట్టకు మాత్రమే ప్రత్యేకత.



కల్యాణోత్సవం వేదిక వద్ద ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

బుక్కరాయల కాలం నుంచి...

ఈ సంప్రదాయం నిన్న.. మొన్న.. నేటిది కాదు. క్రీ.శ..1356లో బుక్కరాయల కాలం నాటి నుంచి ఇలాగే కొనసాగుతోంది. అమృతం కోసం రాక్షసులు.. దేవతలు సముద్రాన్ని చిలికారు. అప్పుడు హాలాహలంతో పాటు కల్పవృక్షం, ఉచ్చైశ్రవం, శంఖం.. ఇలా మరెన్నో పుట్టాయి. అమృతం కంటే ముందు శ్రీమహాలక్ష్మి పుట్టింది. చంద్రుడు పుట్టాడు. శ్రీమహాలక్ష్మి మహావిష్ణువుకు ఇల్లాలు కాగా.. చంద్రుడు ఆమెకు తోబుట్టువయ్యాడు. కాగా భూలోకంలో బాలరాముడికి గోరుముద్దలు తినిపించాలంటే చంద్రశాలపైకి కౌశల్య తీసుకెళ్లాల్సిందే. చంద్రుడు కనిపించి సరదాలు తీరిస్తే కానీ బాలరామయ్యకు ముద్దదిగదు. సూర్యవంశస్తుడైన శ్రీరాముడు తేజం, వెన్నెల, ప్రసన్నత, చల్లదనం, ప్రతాపం కలిగి ప్రజలను చక్కగా పాలించే శ్రీరామచంద్రుడయ్యాడు. తన పేరు శ్రీరామునికి తోడైనందుకు చంద్రుడు ఆనందించాడు. దేశమంతా జరిగే శ్రీరామ బ్రహ్మోత్సవాల్లో శ్రీరాముని కల్యాణం చూసే అవకాశం చంద్రునికి లేకుండాపోయింది. సీతారామచంద్రుల కల్యాణం అనే పేరే కానీ ఎక్కడా చంద్రునికి ఆహ్వానం లేదు. చంద్రుడు ఈ బాధను భరించలేకపోయాడు. బ్రహ్మోత్సవాలలో అధినాయకుడైన బ్రహ్మకు తన ఆవేదనను నివేదించుకున్నాడు. బ్రహ్మ అందుకు తగిన ఏర్పాట్లు చేస్తానని మాట ఇచ్చి ఒంటిమిట్టలో శ్రీరామ బ్రహ్మోత్సవాల్లో చతుర్దశ నాటి రాత్రి వివాహ మహోత్సవం జరిగేలా అవకాశం కల్పించాడు. కళా పూర్ణుడైన చంద్రుడు సీతారామకల్యాణాన్ని పరమానందంతో తిలకిస్తాడు.

ఇంకో కథనం.. :

ఒంటిమిట్టలో శ్రీరామ కల్యాణం తిలకించే ఏర్పాటు చేసింది శ్రీమహావిష్ణువు అని కూడా ఓ కథనం. త్రేతాయుగంలో శ్రీరాముడు పునర్వసు నక్షత్రంలో పగటిపూట జన్మించాడు. సకల దేవతలు నేల మీద అవతరించి స్వామిని దర్శించి పుష్పవృష్టి కురిపించారు. మహర్షులు ఆశీర్వదించారు. పగటివేల జననం కారణంగా చంద్రుడు ఆ సన్నివేశం చూడలేకపోయాడు. శ్రీమహావిష్ణువు ద్వాపర యుగంలో శ్రీ కృష్ణభగవానుడిగా రాత్రిపూట జన్మించాడు. చంద్రుడు శ్రీకృష్ణజననం చూడగలిగాడు. అయినా శ్రీరామ కల్యాణం చూడలేకపోతున్నాననే చంద్రుని వేదనను శ్రీమహావిష్ణువు ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలతో తీర్చాడు. ఈ రెండు ఇతిహాసాలను కొట్టిపారేయడం అంతసులభం కాదు.

చారిత్రక నేపథ్యం

క్రీ..శ.. 1356లో బుక్కరాయలు ఒంటిమిట్ట శ్రీరామ బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. రామాయణంలో శ్రీరామ చంద్రుడి కల్యాణ నక్షత్రం ఉత్తర ఫాల్గుణమైనందున అందువల్ల ఆ నక్షత్రానికే ఒంటిమిట్టలో వివాహం జరిపించే నిర్ణయం తీసుకున్నారు. అయితే ఒంటిమిట్టలోని తొలి కల్యాణ మహోత్సవానికి ఉత్తర ఫల్గుణి నక్షత్రం రాత్రిపూట వచ్చి ఉంటుంది. రాత్రిపూట వివాహం జరగవచ్చునా..? లగ్నశుద్ధ సప్తమి శుద్ధ చూసుకొని వివాహ మహోత్సవాన్ని కాలం నిర్ణయించింది. ఇది శాస్త్ర నిషిద్ధం కాదు. ఆ విధంగా బుక్కరాయలు రాత్రిపూటే తొలి సీతారాముల కల్యాణ మహోత్సవం జరిపించారు. మరో కథనం ప్రకారం.. బుక్కరాయులు చంద్రవంశీయుడు. యాధృచ్ఛికరంగా మొదటి తిరుణాలలో రాముల వారి కల్యాణం రాత్రి సమయంలో వచ్చింది. తమ వంశ మూల పురుషుడు చంద్రుడు చూస్తూ ఆనందిస్తుండగా శ్రీరామ చంద్రుని కల్యాణం జరిపించిన సంతోషం బుక్కరాయల్లో కలిగి ఉంటుంది. దీంతో జగదభిరాముడికి కల్యాణం ఒంటిమిట్టలో రాత్రి పూటే జరుగుతుంది. ఇంతటి విశిష్టత, ప్రత్యేకత కలిగిన ఒంటిమిట్టలో జగదభిరాముడి కల్యాణాన్ని చైత్రశుద్ధ చతుర్దశి నాటి రాత్రివేళ నెలరాజుతో పాటు వీక్షించి మనం ధన్యులమవుదాం.

పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు

కోదండరాముని కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఇతర మంత్రులు, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావులతో పాటు రాష్ట్ర దేవదాయశాఖ ఉన్నతాధికారులు, టీటీడీ ఉన్నతాధికారులు, ఆగమ శాస్త్ర పండితులు, కడప జిల్లా కలెక్టర్‌తో పాటు అనేక మంది ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం కడప జిల్లా యంత్రాంగంతో కలిసి కల్యాణోత్సవానికి భారీ ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా కల్యాణ ప్రాంగణాన్ని కనీవిని ఎరుగని రీతిలో దేశ, విదేశాల్లో లభించే అరుదైన పుష్పాలతో అందంగా అలంకరించి దేవతామూర్తులతో కలిపిన విద్యుద్దీపాలను భారీ ఎత్తున అలంకరించారు. కల్యాణోత్సవానికి ఒంటిమిట్టను మరో వైకుంఠంగా తీర్చిదిద్దారు.

అశ్వ వాహనంపై పట్టాభిరాముడి వైభవం..

- వేడుకగా పార్వేట ఉత్సవం



ఊంజల్‌సేవలో శ్రీరాముడు, (ఇన్‌సెట్లో) అశ్వవాహనంపై పట్టాభిరాముడు

వాల్మీకిపురం, ఏప్రిల్ 10: వాల్మీకిపురం పట్టాభిరాముడి విశ్వావసునామ సంవత్సర సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం టీటీడీ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, తోమాలసేవలతో విశేష పూజలు జరిగాయి. భోగోత్సవ మూర్తులైన సీతారామలక్ష్మణులకు విశేష అలంకరణలతో తిరుచ్చిలో వేంచేపు చేసి తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయ మండపంలో యాగశాల వైదిక కార్యక్రమాలు సాగాయి. సాయంత్రం పట్టాభిరాముడికి ఊంజల్‌సేవ కన్నుల పండుగగా నిర్వహించారు. స్థానిక పార్వేట మండపం వద్ద ఉత్సవ వేడుకలు నిర్వహిస్తూ భక్తులకు విశిష్టతను తెలియజేశారు. అనంతరం రాత్రికి అశ్వ వాహనంపై పట్టాభిరాముని విశేషాలంకరణలతో అధిష్టింప చేసి పురవీధులలో నిర్వహించిన నగరోత్సవం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా కోలాటలు, చెక్క భజనలు, మహిళల చలిపిండి దీపారాధనలు, టీటీడీ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమాలలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ ముని బాల కుమార్, ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు, టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు, కృష్ణప్రసాద్‌భట్టార్, కృష్ణరాజు, సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, భాషికాచార్యులు, ధనుష్‌భట్టార్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు: పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం టీటీడీ ఆధ్వర్యంలో వసంతోత్సవం, చక్రస్నానం, రాత్రికి హంస వాహనంపై పట్టాభిరాముడి నగరోత్సవం, ధ్వజాఅవరోహన కార్యక్రమాలు జరగనున్నాయి.

ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగిస్తే ఉపేక్షించం

- గ్యాంగ్‌వార్ కేసులో 9 మంది నిందితుల అరెస్ట్
- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించినా, అల్లర్లకు పాల్పడినా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు హెచ్చరించారు. రంజాన్ పండుగ సందర్భంగా ఇరువర్గాల మధ్య జరిగిన గ్యాంగ్ వార్ కేసులో నిందితులుగా ఉన్న 9 మందిని గురువారం రాయచోటి అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వివరాలను ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించే విధంగా ఎవరు ప్రవర్తించినా ఉపేక్షించమన్నారు. గత నెల 31న రంజాన్ పండుగ సందర్భంగా రాత్రి 11 గంటల సమయంలో రెండేళ్ల క్రితం అమ్మాయి విషయంలో పాత కక్షల కారణంగా సయ్యద్ నూరుల్లా అలియాస్ నూర్‌తో పాటు మరి కొంత మంది కలిసి దేశ్‌ముఖ్ ఇస్రాన్‌అలీఖాన్ వర్గంపై కట్టెలు, ఇనుప రాడ్లు, చైన్‌లతో దాడి చేసి ఇస్రాన్‌అలీఖాన్, రియాన్‌అలీఖాన్, అహ్మద్ బాషాలను తీవ్రంగా గాయపరిచారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రాయచోటి అర్బన్ సీఐ బి.వెంకటచలపతి, ఎస్ఐ జహీర్‌ల ఆధ్వర్యంలో పోలీసులు గురువారం గ్యాంగ్‌వార్ కేసులో నిందితులుగా ఉన్న రాయచోటి పట్టణంలోని కొత్తపల్లికి చెందిన సయ్యద్ నూరుల్లా అలియాస్ నూర్, సయ్యత్ బతుల్లా, షేక్. ఖదీర్‌అహ్మద్ అలియాస్ ఖాదర్, షేక్.సుహేల్ అలియాస్ గుర్రం, షేక్.మన్సూర్‌అలీ, షేక్.ఇర్ఫాన్, షేక్.ఫారూఖ్, షేక్.ఇర్ఫాన్, పఠాన్ రియాజ్ అలీఖాన్ అలియాస్ నాజుల్లాలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి దాడికి ఉపయోగించిన 5 కట్టెలు, 3 ఇనుప రాడ్లు, ఒక ఇనుప చైను, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా అల్లర్లకు పాల్పడే 100 మందిని గుర్తించామని, అందిరిపైనా రౌడీషీట్ ఓపెన్ చేస్తామని ఎస్పీ చెప్పారు. అలాగే లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినా, మైనర్లకు వాహనాలు ఇచ్చినా అటువంటి వారిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా అసాంఘీక కార్యకలాపాల నివారణ కోసం, ఆకతాయిల అల్లర్ల కట్టడి కోసం రూ.10 లక్షలతో జిల్లా వ్యాప్తంగా 300 సీసీ కెమెరాలు త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. పిల్లలను అదుపులో పెట్టుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. రాయచోటి పట్టణంలో ఎవరైనా గ్యాంగ్‌లుగా ఏర్పడి ప్రజా శాంతికి వివాదం కలిగించే విధంగా ఘర్షణలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, అలాంటి వారు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి, రాయచోటి అర్బన్ సీఐ బీవీ చలపతి, ఎస్ఐ జహీర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు ఒంటిమిట్టకు రాక

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఈనెల 11వ తేదీ శుక్రవారం ఒంటిమిట్టకు రానున్నారు. సీతారాముల కల్యాణోత్సవ కార్యక్రమంలో పాల్గొని పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. విజయవాడలో మధ్యాహ్నం 3-35 గంటలకు విమానంలో బయలుదేరి 4-20 గంటలకు కడప విమానాశ్రయం చేరుకుంటారు. 4-30 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి సాయంత్రం 5 గంటలకు ఒంటిమిట్టలోని టీటీడీ అతిథి గృహానికి చేరుకుంటారు. 6-05 గంటల వరకు రిజర్వ్‌లో ఉంటారు. 6-10 గంటలకు కోదండరామ స్వామి ఆలయానికి చేరుకుంటారు. 6-15 నుంచి 6-30 గంటల వరకు స్వామి వారిని దర్శించుకొని పట్టువస్త్రాలు సమర్పిస్తారు. 6-35 గంటలకు కల్యాణ వేదిక వద్దకు చేరుకుని 8-30 గంటల వరకు సీతారాముల కల్యాణోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారు. 8-35 గంటలకు అక్కడ నుంచి బయలుదేరి 8-40 గంటలకు ఒంటిమిట్టలోని టీటీడీ అతిథి గృహానికి చేరుకుని రాత్రికి అక్కడే బస చేస్తారు. 12వ తేదీ ఉదయం 8-50 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 9-20 గంటలకు కడప విమానాశ్రయం చేరుకుంటారు. 9-30 గంటలకు ప్రత్యేక విమానంలో బయలుదేరి 10-15 గంటలకు విజయవాడ విమానాశ్రయం చేరుకుంటారు. 10-20 గంటలకు అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10-30 గంటలకు ఉండవల్లిలోని తన నివాస గృహం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. ఈ మేరకు జిల్లా కేంద్రానికి గురువారం ముఖ్యమంత్రి పర్యటన వివరాలు అందాయి.

పరిహారం చెల్లించకపోతే ఉరే శరణ్యం

- ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులు ఉరితాళ్లతో నిరసన

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రిజర్వాయర్ కోసం తీసుకున్న భూములకు నష్టపరిహారం చెల్లించకపోతే ఉరే శరణ్యమని ముదివేడు రిజర్వాయర్ నిర్వాసిత రైతులు వాపోయారు. గురువారం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఉరితాళ్లు మెడకు బిగించుకుని కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ గత ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించి ముదివేడు రిజర్వాయర్ కోసం భూములు లాక్కొంటే పరిహారం చెల్లించకుండా, పునరావాసం కల్పించకుండా కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. రైతుల భూములకు నష్టపరిహారం చెల్లించలేని పక్షంలో భూములు వెనక్కి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు శ్రీనివాసులు, రాజేశ్, వెంకటరెడ్డి, మారపరెడ్డి, తిమ్మారెడ్డి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 268 దేవాలయాలకు అర్చకుల ఏర్పాటు

రామాపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 268 దేవాలయాలకు అర్చకులను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా దేవాదాయశాఖ అధికారి విశ్వనాధ్ తెలిపారు. మండలంలోని గురువారం బండపల్లి, సూర్యనారాయణపురంలో శ్రీమల్లాలమ్మ తల్లి ఆలయం గువ్వలచెరువు, ఓబుల్‌రెడ్డిగారిపల్లె, యర్రమరెడ్డిగారిపల్లె, రాచపల్లి, వడ్డెపల్లి, పర్వతిరెడ్డిగారిపల్లె, నల్లగుట్టపల్లి, పాతపల్లి, కర్ణపువాండ్లపల్లె గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 268 దేవాలయాలకు ధూప, దీప నైవేద్యం కొరకు అర్చకులను ఏర్పాటు చేసుకొనేందుకు లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రతి గ్రామంలో ఉన్న దేవాలయాల్లో అర్చకులు సక్రమంగా పూజలు చేయకుండా ఉంటే అటువంటి వారిపైన గ్రామస్తులు ఫిర్యాదులు ఇస్తే వారిని వెంటనే తొలగిస్తామన్నారు. గుడిలో పూజలు, ధూపదీప నైవేద్యాలు చేసే అర్చకులకు ఒక్కొక్కరికి ప్రభుత్వం నుంచి రూ.10 వేలు వారికి వేతన రూపంలో అందిస్తారన్నారు. దేవాలయాల్లో అర్చకులను పరిశీలించడం అనంతరం ఈ నివేదికను పై అధికారులకు పంపిస్తామని తెలిపారు.

కడప స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా సుధాకర్

కడప క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కడప స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా ఎన్.సుధాకర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 1991 బ్యాచ్‌కు చెందిన ఈయన జిల్లాలోని పలు స్టేషన్లలో పనిచేశారు. ప్రస్తుతం వెయిటింగ్ లిస్టులో ఉన్న ఈయనకు పోస్టింగ్ ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ఒంటిమిట్ట కల్యాణం నేపథ్యంలో వాహనాల దారి మళ్లింపు

- ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్టలో ఈ నెల 11న శుక్రవారం జరగనున్న సీతారాముల కళ్యాణం నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ మళ్లించామని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనలో తెలియజేశారు. మళ్లింపు ఈ నెల 11న ఉదయం నుంచి 12న ఉదయం వరకు అమలులో ఉంటుందని తెలిపారు. ఈ కార్య క్రమం నిర్వహణ సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాతీయ రహదారి-716 మీదుగా వచ్చే భారీ వాహనా లను రేణిగుంట, రాజంపేట, కడప వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల ద్వారా ఇతర మార్గాల్లో వెళ్లేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



ట్రాఫిక్‌పై ఆంక్షలు విధిస్తున్న పోలీసులు

18 చోట్ల పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు

సీతారామ కల్యాణానికి రాజంపేట వైపు నుంచి వచ్చే భక్తులు టూవీలర్, ఫోర్ వీలర్ వాహనాలను సాలాబాద్ సమీపంలో 5 చోట్ల ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాల్లో క్రమబద్ధతిలో నిలపాలి. కల్యాణ వేదిక నుంచి కడప మార్గంలో 13 పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు.

వాహనాల దారి మళ్లింపు వివరాలు

కడప- తిరుపతి వైపు వెళ్లే వాహనాలు కడప నగరం ఆలంఖాన్‌పల్లె ఇర్కాన్ సర్కిల్ నుంచి ఊటుకూరు సర్కిల్, రాయచోటి మీదుగా తిరుపతి వెళ్లాలి. తిరుపతి నుంచి కడప వైపు వచ్చే వాహనాలు రాయచోటి మీదుగా కడపకు చేరుకోవాలి. రాజంపేట వైపు నుంచి కడపకు వెళ్లే భారీ వాహనాలను రాయచోటి మీదుగా దారి మళ్లించారు. అయితే ద్విచక్ర వాహనాలను సాలాబాద్ నుంచి ఇబ్రహీంపేట, మాధవరం మీదుగా పంపేందుకు పోలీసులు ఏర్పాటు చేశారు.

కడప వైపు పార్కింగ్ ప్రదేశాలు

ఒంటిమిట్టకు వచ్చే భక్తుల కోసం 13 ప్రదేశాల్లో పార్కింగ్ ఏర్పాటు చేశారు.

- ఫోర్‌వీలర్స్‌కు జనరల్ పార్కింగ్ చలమయ్య యాదవ్ సైట్, మాధవరం-1 (హెచ్‌పీ పెట్రోలు బంకు తూర్పు వైపున).
- త్రీవీలర్స్‌కు కనకదుర్గ కళ్యాణమండపానికి పడమటి వైపున మాధవరం -1 వద్ద.
- కనకదుర్గ కల్యాణ మండపం తూర్పు వైపున - మాధవరం-1, సన్నీ ఫుడ్ కోర్టు ఫ్యామిలీ దాబా తూర్పు వైపు, పడమటి వైపున, పీహెచ్‌సీ కొత్తమాధవరం (ఫారెస్టు చెక్‌పోస్టు ఎదురుగా) కార్ల పార్కింగ్ ఏర్పాటు చేశారు.
- ఆర్టీసీ బస్సులకు శ్రీ షిర్డీసాయి డిగ్రీ కళాశాల, ఓబుల్‌రెడ్డి వాటర్ ప్లాంటు / ప్లైసెస్ బోర్డు మధ్యలో పార్కింగ్ ఇచ్చారు.
- ఉచిత బస్సులు, వీఐపీ కారు పార్కింగ్.. శ్రీషిర్డీసాయి డిగ్రీ కళాశాల, రాయలసీమ హోటల్ (వీవీఐపీ అండ్ వీఐపీ ఎంట్రెన్స్ ఆర్చి ఎదురుగా).
- పోలీసు వాహనాలకు ఇండియన్ ఆయిల్ పెట్రోలు బంకు, మయూన హోటల్ వెనక వైపున. టీటీడీ వాహనాల పార్కింగ్ కళ్యాణవేదిక ప్రధాన ప్రవేశం ఆర్చి వద్ద ఉన్న సత్రం వద్ద.
- ఇతర శాఖల వాహనాల పార్కింగ్ ఈద్గా పక్కన, ఒంటిమిట్ట (కారు పార్కింగ్)
- టూవీలర్, కారు పార్కింగ్.. కల్యాణ రామ టౌన్‌షిప్ అండ్ బ్రిడ్జి పక్కన, దర్జిపల్లి రోడ్డు, కొత్తపల్లి గ్రామ సమీపంలో.

రాజంపేట వైపు పార్కింగ్ ప్రదేశాలు

- ఆర్టీసీ బస్సు పార్కింగ్.. సాలాబాద్ క్రాస్ వద్ద.
- ఫోర్‌వీలర్, టూవీలర్ పార్కింగ్.. మదరసా, మలకాటిపల్లె గ్రామం.
- వీఐపీ కారు పార్కింగ్.. బీసీ బాయ్స్ హాస్టల్, దుర్గమ్మ గుడి ముందు వైపు, ఒంటిమిట్ట టౌన్.

పోలీసుశాఖకు వాహనదారులు సహకరించాలి

- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు సూచన

రాయచోటిటౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఒంటిమిట్ట కోదండ రామాలయంలో శుక్రవారం జరగనున్న సీతారాముల కల్యాణం నేపథ్యంలో ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కడప- రేణిగుంట రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒంటిమిట్ట కోదండరామస్వామి కల్యాణం సందర్భంగా ఈ నెల 11న శుక్రవారం ఉదయం 10 నుంచి 12వ తేది శనివారం మధ్యాహ్నం 2 గంటల వరకు ట్రాఫిక్ దారి మళ్లింపు ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. భక్తుల వాహనాలు మినహా ఎలాంటి ఇతర వాహనాలు అనుమతించరని ఆయన తెలిపారు.

దారి మళ్లింపు వివరాలు

కడప నుంచి తిరుపతి వైపు వెళ్లే వాహనాలు కడప నగరం ఊటుకూరు సర్కిల్ నుంచి వయా గువ్వలచెరువు, రాయచోటి మీదుగా తిరుపతి వెళ్లాలన్నారు. అలాగే తిరుపతి నుంచి కడప వైపు వెళ్లే అన్ని వాహనాలు తిరుపతి నుంచి వయా భాకరాపేట, పీలేరు, రాయచోటి మీదుగా కడపకు చేరుకోవాలన్నారు. అలాగే రైల్వేకోడూరు, రాజంపేట వైపు నుంచి కడపకు వెళ్లే వాహనాలు రాజంపేట నుంచి రాయచోటి మీదుగా కడపకు చేరుకునే విధంగా దారి మళ్లింపు చేసినట్లు ఎస్పీ తెలియజేశారు. ఈ ట్రాఫిక్ దారి మళ్లింపు విషయాన్ని వాహనదారులు గమనించాలన్నారు. ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీస్ శాఖకు సహకరించాలని తెలిపారు. ఒంటిమిట్ట కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు.

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. అభివృద్ధి శూన్యం

● జీర్ణోద్ధరణకు నోచుకోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం
● ఆలయ అభివృద్ధికి ప్రతిపాదనలు పంపిన పాలక మండలి


శిథిలమవుతున్న గాలిగోపురం


రోడ్ల విస్తరణతో తగ్గిపోయిన ఆలయం


శిథిలమైన ఆలయ ప్రాకారం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం. ఎంతో చరిత్ర గల ఆలయం. శ్రీరామ చంద్రుడు ప్రతిష్ఠించిన శివలింగం ఉండడంతో ఈ ప్రాంతానికి ముక్తిరామేశ్వరమని పేరు వచ్చింది. మార్జాలరూపంలో ఉన్న రావణుడిని రాముడు బాణంతో వదించి ముక్తిని ప్రసాదించడంతో ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంగా పేరు పొందింది. ఇంతటి చారిత్రక ప్రాశస్త్యం ఉన్న ఆలయానికి మాన్యాలు, భూములు ఉన్నా... అభివృద్ధికినోచుకోక.. ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంటోందని లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆలయ చరిత్ర

రావణ వధ అనంతరం తనకు ఆపాదితమైన బ్రహ్మహత్య దోష నివారణకు శ్రీరాముడు ఈ ప్రాంతంలో శివలింగాను ప్రతిష్ఠించాలని సంకల్పించారు. రాముని ఆజ్ఞతో ఆంజనేయుడు కాశీ నుంచి శివలింగం తీసుకురావడానికి వెళ్లాడు. ముహూర్త సమయానికి ఆంజనేయుడు రాకపోవడంతో శ్రీరాముడు సైకత లింగంను ప్రతిష్ఠించారు. సైకత లింగంపై శ్రీరాముని వేలి ముద్రలు స్పష్టంగా కనిపిస్తాయి. ఆ తర్వాత వచ్చిన అంజనేయుడు తాను తెచ్చిన శివలింగాన్ని ప్రతిష్ఠించాలని పట్టుబట్టడంతో సైకత లింగానికి కొంత దూరంలో ప్రతిష్ఠించారు. ఆ గుడి నేడు ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం, హనుమత్ లింగేశ్వరస్వామి ఆలయాలుగా ప్రసిద్ధి పొందాయి. ఆలయంలో ఎత్తైన ప్రాకారంతో అయిదు అంతస్తుల గాలిగోపురంతో అలరాడుతోంది.

దెబ్బతిన్న గాలిగోపురం

ఆలయ గాలిగోపురం పై భాగం దెబ్బతింది. ఆలయం చుట్టూ ఉన్న ప్రాకారం శిథిలమవుతోంది. ఆలయం చుట్టూ రోడ్లు విస్తరించడంతో ఆలయం తగ్గుగా మారి వర్షం వచ్చినప్పుడు భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఆలయ అభివృద్ధి కోసం పాలక మండలి ఆధ్వర్యంలో రూ.5 కోట్లతో ప్రభుత్వానికి రెండేళ్ల క్రితం ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం మారిపోవడంతో ఆ ప్రతిపాదనలను పక్కనబెట్టారు. ప్రస్తుతం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సహకారంతో గాలిగోపురం పునర్నిర్మాణం, ఉత్తరం వైపున మూడు అంతస్థులతో కొత్తగా గాలిగోపురం నిర్మాణం, నూతన ప్రహరీ ఏర్పాటు, 12 అడుగుల ఎత్తులో ప్రాకార మండపాల పునర్నిర్మాణ పనులు చేపట్టాలని ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

అనుమతి రాగానే పనులు చేపడుతాం

ఆలయ అభివృద్ధి కోసం భక్తుల ద్వారా 20 శాతం విరాళాలు రాబట్టి ప్రభుత్వానికి పంపుతాం. ప్రభుత్వం 80 శాతం సీజీఎఫ్ నిధులను మంజూరు చేస్తుంది. ఆలయ జీర్ణోద్ధరణకు సంబంధించిన పనులను స్తపతి పరమేశ్వరప్ప పరిశీలించారు. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే.. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సహకారంతో మూడు నాలుగు నెలల్లో ఆలయ అభివృద్ధి పనులను చేపడుతాం.

- మార్తల రాజారెడ్డి, ఆలయ చైర్మన్

ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలి : కలెక్టర్


పాలీహౌస్‌లో రోజాతోటను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

బి.కొత్తకోట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగి రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాల్సిందేనని, ఇందులో ఎవరికీ మినహాయింపు లేదని కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. గురువారం బి.కొత్తకోటలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తొలుత తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ రీసర్వే, ఫ్రీహోల్డ్ భూములు, పొజిషన్ సర్టిఫికెట్లపై సమీక్షించారు. ఫ్రీహోల్డ్ భూములు, హౌసింగ్ రీవెరిఫికేషన్‌లో వెనుకబడిన అధికారులకు అక్షింతలు వేశారు. అనంతరం ఉద్యానవనశాఖ, హౌసింగ్ శాఖ అధికారులతో సమావేశమై ఆయా శాఖల పురోగతి, పనితీరును పరిశీలించారు. మండలంలో ఎంత విస్తీర్ణంలో ఏఏ వ్యవసాయ పంటలు సాగవుతున్నాయి, కాలపరిమితి, దిగుబడి, చీడపీడల నివారణ తదితర అంశాలపై చర్చించారు. హౌసింగ్ పట్టాల రీవెరిఫికేషన్‌లో అనర్హుల గుర్తింపులో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. మండల శివారులో సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్ ఆధ్వర్యంలో రైతు నగేష్‌బాబు చేపట్టిన రోజా పూలసాగు, సబ్సిడీతో చేపట్టిన పాలీహౌస్ నిర్మాణాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రోజా పూల సాగుకు నిర్వహణ ఖర్చులు, మార్కెటింగ్, ఆదాయంపై అక్కడ పని చేస్తున్న కూలీలను అడిగి వివరాలను తెలుసుకున్నారు. బీరంగి గ్రామ పరిధిలో మల్చింగ్ పేపర్‌తో సాగు చేస్తున్న టమోటా, మిరప పంటలను పరిశీలించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను వినియోగించుకొని లబ్ధి పొందాలని కోరారు. అనంతరం బీరంగి పంచాయతీ పరిధిలో ఓ రైతు సాగు చేస్తున్న టమోటా పంటపై ఆరా తీశారు. ఒక ఎకరం టమోటా సాగుకు అయ్యే ఖర్చు, యాజమాన్య పద్ధతులు మార్కెటింగ్‌పై సంబంధిత రైతులతో చర్చించారు. కలెక్టర్ ఆకస్మిక పర్యటన సందర్భంగా సిబ్బంది హైరానా పడ్డారు. తహశీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల సమీక్షలో సైతం మీడియాను అనుమతించకుండా రహస్యం పాటించారు. తహశీల్దార్ అజారుద్దీన్, ఎంపీ డీవో దిలీప్‌కుమార్, సర్వేయర్ ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

డైట్ కళాశాలలో ఐసీటీ ల్యాబ్ ప్రారంభం

రాయచోటిటౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని డైట్ కళాశాలలో ఆధునిక సాంకేతికతకు తోడ్పాటుగా ఐసీటీ కంప్యూటర్ ల్యాబ్‌ను గురువారం రిటైర్డ్ అడిషినల్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వీరభద్రారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరభద్రారెడ్డి మాట్లాడుతూ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు, వీడియోలు, అనిమేషన్‌ల ద్వారా పాఠాలను ఆసక్తికరంగా బోధించవచ్చునన్నారు. గణితశాస్త్రం, భౌగోళికం వంటి విషయాల్లో విజువల్ డెమోన్‌స్ట్రేషన్లు అందించడం సులభతరం అన్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం మాట్లాడుతూ ఇంటరాక్టీవ్ లెర్నింగ్ టూల్స్ (ఆప్‌లు, గేమ్స్, క్విజ్‌లు) ద్వారా విద్యార్థుల ఆసక్తి పెరుగుతుందన్నారు. అనంతరం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ డిజిటల్ టెస్టులు, ఈ-పుస్తకాలు, సిమ్యులేషన్ల ద్వారా అభ్యాసాన్ని మెరుగుపరచవచ్చునన్నారు. విద్యార్థుల ప్రగతిని ఆన్‌లైన్ ద్వారా గుర్తించి వారికి సరైన మార్గనిర్దేశనం చేయవచ్చునని తెలిపారు. ఐసీటీ లెక్చరర్ అసదుల్లా, కళాశాల అధ్యాపకుల శివభాస్కర్, రెడ్డెప్పరెడ్డి, జాఫర్, రెడ్డెయ్య, నాగేశ్వరావు పాల్గొన్నారు.

చీటీల పేరుతో... రూ.7 కోట్లకు టోకరా

● పోరుమామిళ్లలో వైరల్‌గా మారిన సంఘటన
● ఆందోళనలో బాధితులు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల ప్రాంతంలో చీటీలు వేయడం.. పెద్ద మొత్తంలో డబ్బులు వసూళ్లు చేసి పత్తా లేకుండా పోవడం సర్వసాధారణమైంది. ఇటీవల ఓ వ్యక్తి రూ.20 కోట్లకు పైగా చీటీల పేరా టోకరా వేసి అందుబాటులో లేకపోవడంతో దాదాపు 150 మందికి పైగా బాధితులు పోలీసులను ఆశ్రయించడం, చివరికి ఆ వ్యక్తి కటకటాలపాలైన సంఘటన తెలిసిందే. ఇది మరవక ముందే పోరుమామిళ్లలో మరో వ్యక్తి రూ.7కోట్లుకు పైగా చీటీల పేరు వసూళ్లు చేసి గత నాలుగైదు రోజులుగా కనిపించకపోవడం, ఫోన్లకు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో బాధితుల్లో ఆందోళన మొదలైంది.

పోరుమామిళ్లలోని లక్ష్మి వెంకటేశ్వరస్వామి గుడి సర్కిల్ పరిధిలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి గత మూడేళ్లుగా సన్నిహితులు, వ్యాపారస్తులతో చీటీల వ్యాపారం చేస్తూ అందరితో కలుపుగోలుగా ఉండేవారు. చీటీలు పూర్తయిన తరువాత మళ్లీ వాటిని రెట్టింపు చేసేవాడని సమాచారం. ఇతను ఒక్కసారిగా కనిపించకపోవడంతో వ్యాపార దుకాణాల వద్ద, ఇళ్లవద్ద చర్చ సాగుతోంది. అమ్మవారిశాలవీధిలోనే ఒకే కుటుంబంలో వారికి లక్షల రూపాయలు బాకీ ఉన్నాడని సమాచారం. ఎలక్ట్రికల్ దుకాణం నిర్వహించుకునే ఓ వ్యక్తికి రూ.9 లక్షలు, కలసపాడులో కూడా ఓ వ్యక్తికి రూ.28లక్షలు, పోరుమామిళ్లలోని పొట్టిశ్రీరాములు విగ్రహం సమీపంలో నివాసం ఉంటున్న వ్యక్తికి లక్షల రూపాయల్లో బాకీ ఉన్నట్లు సమాచారం. దాదాపు 70 మందికి పైగా ఒకరికి తెలియకుండా మరొకరికి చీటీలు వేస్తూ.. అప్పులు చేస్తూ టోకరా పెట్టినట్లు సమాచారం. ఇటీవల కంటి ఆపరేషన్ అని చెప్పి వెళ్లిన ఆ వ్యక్తి పోరుమామిళ్లలో కనపడకపోవడంతో చీటీలు వేసిన వారితో పాటు అప్పులు ఇచ్చిన వారిలో సందేహాలు తలెత్తాయి. ఈ సంఘటనపై పోరుమామిళ్లలో రకరకాలుగా చర్చించుకుంటున్నారు. చీటీల డబ్బుతో బంగారు కొనుగోలు చేశాడని, దాదాపు కోటి వరకు డబ్బులతో వెళ్లిపోయాడని, ఇప్పుడు పోరుమామిళ్లకు వచ్చే పరిస్థితి లేదనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇక కొందరు అయితే ఐపీ దాఖలు చేస్తాడా, ఎవరికైనా నోటీసులు పంపిస్తాడా అన్న అనుమానాలు కూడా వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పోరుమామిళ్ల ఎస్‌ఐ ఆర్‌వీ కొండారెడ్డిని వివరణ కోరగా చీటీల పరంగా తమకు ఎవరు ఫిర్యాదు చేయలేదన్నారు.

రాజకీయ కారణాలతోనే అగస్టిన్ రాజు తొలగింపు

● ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి


క్యాంప్‌బెల్ వైద్యశాలలో డాక్టర్ ప్రత్యూషతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు క్యాంప్‌బెల్ వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ అగస్టిన్‌రాజు రాజకీయాలు చేయడంతోనే బిషప్ ఆయనపై తొలగింపు వేటు వేశారని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం జమ్మలమడుగు క్యాంప్‌బెల్ వైద్యశాలను ఎమ్మెల్యే సందర్శించారు. ముందుగా కొత్తగా నియమించిన మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కేపీ రవీంద్రను కలిసి అభినందనలు తెలియజేశారు. ప్రజల కోసం, పేద రోగుల కోసం పనిచేయాలని సూచించారు. కాగా, అగస్టిన్‌రాజు తొల గింపును నిరశిస్తూ.. ఆయననే సూపరింటెండెంట్‌గా తిరిగి నియమించాలని వైద్య సిబ్బంది కోరారు. ఇక సెంట్రల్ బోర్డు ప్రాసెస్ లేకుండానే అగస్టిన్‌రాజును తొలగించారంటూ ఆయన భార్య డాక్టర్ ప్రత్యూష ఎమ్మెల్యేకు తెలిపారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ.. క్యాంప్‌బెల్ ఆస్పత్రిలో మెడికల్ సూపరింటెండెంట్‌గా అగస్టిన్‌రాజు పనిచేస్తూ వైసీపీ తరుపున ఊరూరా ప్రచారం చేయడంతో బిషప్ తొల గించారన్నారు. ఆస్పత్రి విషయాల్లో రాజకీయం చేయాల్సిన అవసరం లేదన్నారు. పేద రోగులకు వైద్యం సక్రమంగా అందించడమే తమ లక్ష్యమన్నారు. అనంతరం రాష్ట్ర మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రామాజీ ఇమ్మానుయేల్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అగస్టిన్ రాజు రాజకీయ పార్టీ కండువా కప్పుకోవడంతోనే బిషప్ తొలగించారని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, గుర్రం ప్రతాప్‌రెడ్డి, సర్పంచు పుల్లారెడ్డి, చెన్నకేశవరెడ్డి, ధనుంజయ, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కారును ఢీకొన్న టిప్పర్.. వ్యక్తి మృతి

మైదుకూరు రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని రాయప్పగారిపల్లె సమీపంలో కారు, టిప్పర్ ఢీకొనడంతో గురు వారం తెన్నేటి వీరబ్రహ్మా య్య (65) మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు నంద్యాల జిల్లా పెసరవాయి గ్రామా నికి చెందిన వీరబ్రహ్మాయ్య పౌరోహిత్యం చేసు కుంటూ జీవనం సాగించేవారు. సొంత పని నిమిత్తం మర్రి పాడుకు ఒక్కడే కారు నడుపుకుంటూ వెళుతుండగా, రోడ్డు పనుల నిమిత్తం తిరుగుతున్న టిప్పర్ రాయప్పగారి పల్లె వద్ద ఢీకొంది. దీంతో వీరబ్రహ్మాయ్యకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఆర్టీసీ బస్సు ఢీ.. స్కూటరిస్టు మృతి


చికిత్స పొందుతూ మృతి చెందిన గురునాథ్

జమ్మలమడుగు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల ఎదురుగా గురువారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు స్కూటర్‌ను ఢీకొనడంతో సిరివెళ్ల గురునాథ్ (20) మృతి చెందాడు. మండలంలోని గూడెం చెరువు గ్రామానికి చెందిన గురునాథ్ ద్విచక్ర వాహనంలో జమ్మలమడుగు వచ్చి తిరిగి ఇంటికి వెళుతున్నాడు. అదే సమయంలో ముద్దనూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గురునాథ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం ప్రొద్దుటూరుకు తరలించగా.. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రిపుల్ ఐటీ ఏవోకు ప్రతిభా అవార్డు


పెనుగొండ రవికుమార్

వేంపల్లె, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో పరిపాలన అధికారిగా పనిచేస్తున్న పెనుగొండ రవికుమార్‌కు అంబేడ్కర్ జాతీయ ప్రతిభా అవార్డు లభించింది. సౌత్ 1 ప్రైవేటు లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగయ్య ఆధ్వర్యంలో ఈ స్వచ్ఛంద సంస్థ అవార్డుకు ఎంపిక చేసింది. ట్రిపుల్ ఐటీలో సీఎస్‌సీ అసిస్టెంటు ప్రొఫెసరుగా 12 ఏళ్లుగా విధులు నిర్వహిస్తూ జపాన్‌లోని ఏఐజెడ్ యూనివర్శిటీలో పరిశోధనలు చేశారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా గుంటూరులోని విజ్ఞాన మందిర్‌లో ఈ అవార్డును అందుకోనున్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ కడప జిల్లాలో 17 కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాల్లో ఆరు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ నిత్యానందరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 7, 8, 9, 10 ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా శుక్రవారం లోపు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. దరఖాస్తులను ఏపీ కేజీబీవీ వెబ్‌సైట్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ వెబ్‌సైట్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే పరిశీలిస్తామని స్పష్టం చేశారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

సింహాద్రిపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలపనూరు గ్రామంలో వంగళ సుజోష్నా అనే మహిళ మెడ నుంచి బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. పోలీసుల వివరాల మేరకు... బలపనూరు గ్రామంలో ఆశావర్కర్‌గా పనిచేస్తున్న సుజోష్నా గురువారం విధులు ముగించుకుని స్వగ్రామమైన నక్కలపల్లికి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. గుర్తు తెలియని వ్యక్తులు బైకుపై వెంబడించి నక్కలపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో ఆమెను భయపెట్టి మెడలో ఉన్న 32 గ్రాముల బంగారు గొలుసును చోరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు.

బధిర బాలికపై వృద్ధుడి లైంగికదాడి

● పోక్సో కేసు నమోదు

కలికిరి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒక దళితవాడకు చెందిన 15 ఏళ్ల బధిర బాలికపై లైంగికదాడి చేశాడంటూ ఓ వృద్ధుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. గుట్టపాలెం ప్రాంతానికి చెందిన గుండ్లూరు హరి (63) బుధవారం ఓ పాడుబడిన ఇంట్లో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు ఫిర్యాదు రావడంతో నిందితుడిని అరెస్టు చేసినట్లు కలికిరి పోలీసులు తెలిపారు. సమీపంలో నివసిస్తున్న వారు విషయం గమనించి తల్లిదండ్రులకు తెలియజేయడంతో వెలుగులోకి వచ్చిందని తెలిపారు. మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు, కలికిరి సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి గురువారం సాయంకాలం గ్రామంలోకి వెళ్లి విచారణ చేశారు.

గర్భిణిపై గృహహింస.. నలుగురిపై కేసు

కురబలకోట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గర్భిణీపై గృహహింసకు పాల్పడ్డారని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని చింతమాకులపల్లెకు చెందిన హరినాథరెడ్డి మదనపల్లె పట్టణం రామారావు కాలనీకి చెందిన పవిత్రను ఏడాది క్రితం వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం ఆమె గర్భిణి కాగా భర్త హరినాథరెడ్డి, అత్తమామలు సునీత, వెంకటరమణ, ఆడపడుచు పద్మావతమ్మలు గృహహింసకు పాల్పడ్డారు. దీంతో ఆమె పుట్టింటికి చేరుకుని తనకు జరిగిన అన్యాయంపై ముదివేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గేటు వసూలు విషయమై ఘర్షణ

● ఇరువురిపై కేసు నమోదు

పులివెందుల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పరిధిలోని కదిరి రోడ్డులో గేటు వసూలు విషయమై లారీ డ్రైవర్లపై దాడికి దిగిన ఇరువు రిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మొలకలవేము లకు చెందిన లారీలు కదిరి రోడ్డులో ఆగి ఉన్నాయి. ఈ సమయంలో మున్సిపాలిటీ పరిధిలో ఆగివున్న వాహనాల గేటు వసూలు కోసం ఇరు వురు వ్యక్తులు లారీ డ్రైవర్ల వద్దకెళ్లి గేటు చెల్లించాలని కోరారు. దీంతో డబ్బులు లేవని, ఓనర్లు వస్తున్నారని, వారు రాగానే చెల్లిస్తామని తెలిపారు. ఆగ్రహించిన గేటు వసూలుదారులు మీకోసం మళ్లీ రావాలా అంటూ వారిపై దాడికి దిగారు. దీంతో డ్రైవర్లు పులివెందుల అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడి చేసిన వారిద్దరు ఎవరనేది పోలీసులు ధ్రువీకరించలేదు.

దిగుబడి ఆశాజనకం.. ధర పతనం

నిరాశ చెందుతున్న రైతులు

చాపాడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేసిన కొర్ర పంట దిగుబడి ఆశాజనకంగా ఉన్నా.. ధర మాత్రం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మార్చి నెలలో వెదురూరు, నరహరిపురం, రాజుపాళెం, తిప్పిరెడ్డిపల్లె, కుచ్చుపాప తదితర గ్రామాల పరిధిలో సుమారు 3 వేల ఎకరాల్లో కొర్రపంట సాగు చేశారు. ఒక ఎకరాకు రూ.10 వేల నుంచి 15 వేల వరకు పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం యంత్రాలతో పంటనుకోస్తున్నారు. నాలుగు రోజుల నుంచి కోత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఒక ఎకరాకు కొర్ర ధాన్యం 10 క్వింటాళ్ల నుంచి 13 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోందని రైతులు చెబుతున్నారు. మైదుకూరు, ప్రొద్దుటూరు ప్రాంతాలకు చెందిన వ్యాపారులు క్వింటాలు రూ.2,200లకు కొనుగోలు చేస్తున్నారు. దిగుబడి ఆశాజనకంగా ఉన్నప్పటికి ధర మాత్రం గిట్టుబాటు కావడం లేదంటున్నారు. గత ఏడాది క్వింటా రూ.3,300 ధర పలికింది. కానీ ఈ ఏడాది తక్కువ ధరకు వ్యాపారులు కొనుగోలు చేస్తుండడంతో రైతులు నిరాశ చెందుతున్నారు.


కొర్రపైరును కోత కోస్తున్న మిషన్

మదనపల్లె డీఎస్పీ బదిలీ

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె డీఎస్పీగా పని చేస్తున్న దర్బార్ కొండయ్యానాయుడు సీఐడీ డీఎస్పీగా బదిలీ చేస్తూ డీజీపీ కోయ ప్రవీణ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ స్థానంలోకి భీమవరంలో డీఎస్పీగా పని చేస్తున్న మహేంద్రను నియమించారు. వెంటనే విధుల్లోకి చేరాలని సూచించారు.

మోహినీ అవతారంలో పట్టాభిరామయ్య



మోహినిగా పట్టాభిరామయ్య

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కందుకూరులోని పట్టాభి రామాలయ బ్రహ్మోత్సవాల్లో గురువారం స్వామివారు మోహినీ అవతారంలో దర్శనం ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ నెల 12న కందుకూరులో రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

చౌడేశ్వరిజ్యోతుల ఉత్సవం

వాల్మీకిపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం మండలంలోని శివపురం గ్రామంలో చౌడేశ్వరిదేవి అమ్మవారి జ్యోతుల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. బుధవారం రాత్రి అమ్మవారికి దీలు సమర్పించారు. గురువారం ఉదయం అగ్నిగుండం కార్యక్రమం నిర్వహించారు.

నేడు పీటీఎం మండల సర్వసభ్య సమావేశం

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ , జడ్పీటీసీ సభ్యులతో పాటు మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన నివేదికలు సిద్ధం చేసుకుని రావాలని ఎంపీడీవో కోరారు.

వివాదాస్పద స్థలం పరిశీలన

పీలేరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాండ్ల పంచాయతీ నల్లగుట్టపల్లె తాండాలోని వివాదాస్పద స్థలాన్ని గురువారం తహసీల్దారు భీమేశ్వర రావు పరిశీలించారు. తనకు ఫిర్యాదు చేసిన బి. పార్వతి, ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజా రామ్మోహన్ రెడ్డిని విచారణ చేశారు. ఇరుపక్షాల రికార్డులు పరిశీలించారు. పూర్తి స్థాయిలో విచారణ చేసేంత వరకు సంయమనం పాటించాలని ఇరుపక్షాలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో హేమంత్ నాయక్, సర్వేయర్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

పీలేరు రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):ఈ నెల 12న పౌర్ణమి సందర్భంగా పీలేరు నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు పీలేరు ఆర్టీసీ డీఎం నిర్మల తెలిపారు. తిరుమణ్ణామలై గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తులు 9441774743కి సంప్రదించి టికెట్లు పొందాలన్నారు. ఒక్కొక్కరికి పోనురాను రూ.700 టికెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. 12న ఉదయం 6.15 నిమిషాలకు బస్సు బయలుదేరుతుందని, భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామాలలో తాగునీటి సమస్యలు రానివ్వొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మనోహర్‌రాజు

వాల్మీకిపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని వాల్మీకిపురం ఎంపీడీవో మనోహర్‌రాజు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ అరుణమ్మ గైర్హాజరు కావడంతో ఎంపీటీసీ రాజేష్ అధ్యక్షతన సమావేశం సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుధ్య సమస్యలపై దృష్టి సారించాలన్నారు. అవసరమైన ప్రాంతాలలో వైద్య శిబిరం నిర్వహించాలన్నారు. తాగునీటి సమస్యలు ఉంటే ట్యాంకర్లతో పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం మంజూరు చేస్తున్న నిధుల ద్వారా సమస్యలు పరిష్కరించడం జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ పామిలేటి, జడ్పీటీసీ నిర్మల, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రజలతో మర్యాదగా ప్రవర్తించాలి: జేసీ

రామసముద్రం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలతో అధికారులు మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. మండలంలోని యర్రబోయనపల్లెలో వివాదాస్పద భూమిని గురువారం ఆయన పరిశీలించారు. భూమికి సంబంధించిన రికార్డులను స్థానిక తహసీల్దార్ నిర్మలాదేవి సమక్షంలో పరిశీలించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ, వీఆర్‌వోలు, ఆర్ఐ, సర్వేయర్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో భూ రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా కమ్మవారిపల్లె సర్పంచ్ ఇంజం వెంకటరమణ, గ్రామస్తులు చలపతినాయుడు జేసీతో మాట్లాడుతూ తహసీల్దార్ నిర్మలాదేవి ప్రజా ప్రతినిధులతో పరుషంగా మాట్లాడుతున్నారని, ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం స్థానిక వీఆర్‌వో, ఆర్ఐ అనుమతి ఇచ్చినా మొత్తం కుటుంబ సభ్యులు తహసీల్దార్ కార్యాలయానికి రావాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అర్జీదారులను ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకే అనుమతిస్తున్నారని ఆపై వచ్చే అర్జీలు స్వీకరించకపోవడంతో సుదూర గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారులు నిరుత్సాహంతో వెనుదిరుగుతున్నారని, గ్రీవెన్స్ డే రోజు కూడా ఉదయం 10గంటల నుంచి వీఆర్‌వోలతో మీటింగ్ పెట్టుకుని అర్జీదారులు గంటల తరబడి వేచి ఉండేలా చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన జేసీ అర్జీదారులతో మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలి, రైతులు ఎప్పుడు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చినా అర్జీలు స్వీకరించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.



తహసీల్దార్‌పై జేసీకి ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ ఇంజం వెంకటరమణనాయుడు

రూ.40లక్షలతో పార్కు అభివృద్ధి

మదనపల్లె టౌన్ : మదనపల్లెలోని రామ్‌నగర్ పార్కు అభివృద్ధికి రూ.40 లక్షల పీకేఎం ఉడా నిధులు వెచ్చించనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. గురువారం మదనపల్లెలోని పీకేఎం ఉడా కార్యాలయంలో జేసీ సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో కలసి రామ్‌నగర్ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు పార్కులోని స్థితిగతులను వివరించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ పార్కులో గ్రీనరి అభివృద్ధికి, బెంచీలు, మరుగుదొడ్లు, తాగునీరు తదితర వసతుల కల్పనకు అవసరమైన నిధులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. 2.50 ఎకరాల విస్తీర్ణం గల ఈ పార్కులో ఇప్పటికే రెండు టెన్నిస్ కోర్టులు ఉండగా, ఈ స్థలం పోను మిగిలిన పార్కు స్థలం అభివృద్ధి చేయాలని, ప్రహరీగోడకు మరమ్మతులు చేయాల్సి వుందని అధికారులు జేసీకి వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ మహేష్, టీపీవో జకీరాబేగం, ఏఈ రూపేష్, పీకేఎం ఉడా సిబ్బంది పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం..

- విలేకరుల సమావేశంలో టీడీపీ నేతలు



మాట్లాడుతున్న టీడీపీ నేత దొరస్వామినాయుడు, టీడీపీ అధ్యక్షుడు పాలగిరి సిద్ధా

ములకలచెరువు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గోరంట్ల మాధవ్ నోరు అదుపులో పెట్టుకో...లేదంటే నాలుక కోస్తామని టీఎస్ఎన్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, టీడీపీ నేత కట్టా దొరస్వామినాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు పాలగిరి సిద్ధా హెచ్చరించారు. ములకలచెరువులో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోమన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గోరంట్ల మాధవ్ సెల్‌ఫోన్‌లో చేసిన అసభ్య చేష్టలు ప్రజలు మరిచిపోలేదన్నారు. నారా లోకేశ్‌ను విమర్శించే స్థాయి నీకు ఉందా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఎనిమిది నెలల్లోనే మంత్రి నారా లోకేశ్ రాష్ట్రానికి ఎన్నో పెట్టుబడులు తీసుకొచ్చారన్నారు. వైఎస్ భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐటీడీపీ కార్యకర్త కిరణ్‌ను సస్పెండ్ చేసి, కేసు నమోదు చేసి అరెస్టు చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఏ మహిళపైనైనా అనుచిత వ్యాఖ్యలు చేస్తే తగిన శిక్ష పడేలా చూస్తారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు కేశవులు, గాండ్ల రెడ్డెప్ప, గొడ్డుమూరు రవి, నాయకులు తంబాళ్ళ బయన్న, ప్రతాప్‌నాయుడు, ఇమాంబాషా, శంకర తదితరులు పాల్గొన్నారు.

నవోదయం-2 పై ప్రజలకు అవగాహన కల్పించాలి

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గ్రామాలను నాటుసారా రహితంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న నవోదయం-2 పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు సూచించారు. గురువారం మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్‌లో ఆయన అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలు చేస్తున్న వారిని ఇప్పటికే గుర్తించి నవోదయం-2 పథకంపై అవగాహన కల్పించామన్నారు. నాటుసారా తయారీ, విక్రయాలు, సేవించడం ప్రాణాంతకమని సూచించామన్నారు. ఈ పద్ధతులను మాని వేయాలని, సన్మార్గంలో పయనించే వారి జీవనోపాధికి ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు ఇస్తోందన్నారు. అలా కాకుండా నేరాలే జీవనంగా సాగించే వారిని గుర్తించి వారిపై పీడీ యాక్టు నమోదుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఎస్ మధుసూదన్, మదనపల్లె, ములకలచెరువు, వాల్మీకిపురం, పీలేరు సీఐలు భీమలింగ, మాధవి, లత, సుబ్బారెడ్డి, ఎస్ఐలు పాల్గొన్నారు.



పట్టుబడిన మద్యంను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

మద్యం, నాటుసారా ధ్వంసం

మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డ నాటుసారా, ఎన్‌డీపీఎల్ మద్యంను ఈఎస్ మధుసూదన్ పర్యవేక్షణలో ధ్వంసం చేశారు. గురువారం స్థానిక మైదానంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈఎస్ మధుసూదన్ మాట్లాడుతూ 56 కేసుల్లో పట్టుబడ్డ రూ.5.66లక్షల విలువైన 1889 లీటర్ల నాటుసారా, 132 ఎన్‌డీపీఎల్ కేసుల్లో పట్టుబడ్డ రూ.6.32లక్షల విలువైన 863 లీటర్ల కర్ణాటక మద్యం, 18 డ్యూటీ పెయిడ్ లిక్కర్ కేసుల్లో పట్టుబడ్డ రూ.72వేల విలువైన మద్యం, ఆరు కేసుల్లో పట్టుబడ్డ రూ.1.07లక్షల విలువైన 2,139 కిలోల నల్లబెల్లంను ధ్వంసం చేశామని ఈఎస్ మధుసూదన్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ భీమలింగ, సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకిపురం: నాటుసారా తయారీ విక్రయాల పట్ల చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని అన్నమయ్య జిల్లా ఎక్సయిజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ హెచ్చరించారు. నవోదయం కార్యక్రమంలో భాగంగా బుధవారం అర్ధరాత్రి వాల్మీకిపురం మండలంలోని ఎగువమేకలవారిపల్లె సమీపంలో దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా నాటుసారా తయారు చేస్తున్న నల్లంకి ఆనంద్(51)ను అరెస్ట్ చేశారు. ఎక్సయిజ్ డీటీఎఫ్ సీఐ ఎల్లయ్య, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కవర్లతో మామిడిలో నాణ్యమైన దిగుబడులు



రైతులకు మామిడి కవర్లు అందజేస్తున్న హెచ్‌వో సుకుమార్ రెడ్డి

పీలేరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మామిడి కాయలకు కవర్లతో రక్షణ కల్పించడం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని పీలేరు ఉద్యాన శాఖాధికారి సుకుమార్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం సబ్సిడీపై కవర్లను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాయలకు కవర్లు కట్టడం ద్వారా ప్రతికూల వాతావరణం, చీడపీడల నుంచి రక్షణ లభిస్తుందన్నారు. మొదటి దశలో 75 ఎకరాల తోటలకు సరిపడే 3 లక్షల కవర్లు సిద్ధంగా ఉన్నాయని, ఆసక్తి గల రైతులు తమ సమీప రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని ఆయన తెలిపారు. ఏఈవో ఇంద్రసేనారెడ్డి, రైతు సుదర్శన్ పాల్గొన్నారు.

మదనపల్లె టౌన్ : స్థానిక రైతుబజార్‌లోని ఉద్యానశాఖ కార్యాలయం వద్ద మదనపల్లె మండలానికి చెందిన రైతులకు 50 శాతం సబ్సిడీపై ఉద్యానశాఖ అధికారి ఈశ్వర ప్రసాద్‌మామిడికాయల సంచులు పంపిణీ చేశారు. మదనపల్లె నియోజకవర్గంలో 3లక్షల సంచులు పంపిణి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

బీఎంసీ వద్ద పాల సేకరణదారు నిరసన



స్థానికులతో కలసి బీఎంసీ ఎదుట నిరసన తెలుపుతున్న పాల సేకరణదారుడు స్వామిరెడ్డి

తంబళ్లపల్లె, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తమ సెంటర్ నుంచి వెళ్తున్న పాలను డెయిరీ అధికారులు కావాలనే తిరస్కరిస్తున్నారని ఆరోపిస్తూ పాల సేకరణ దారుడు స్థానికులతో కలసి కోసువారి పల్లె బీఎంసీ ఎదుట నిరసన వ్యక్తం చేశాడు. పాల సేకరణ దారుడు స్వామి రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. తంబళ్లపల్లె మండలం పరుసతోపు పంచాయతీ దాదంవడ్డిపల్లెలో కోసువారిపల్లె పాల బీఎంసీకి చెందిన 53, 54 పాల సేకరణ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఇందులో 54 సెంటర్ నుంచి బీఎంసీకి ఐదారేళ్లుగా పాలు వెళ్తున్నాయ న్నారు. కొన్ని నెలలుగా తమ సెంటర్ నుంచి వెళ్తున్న పాలను నాణ్యత లేవనే కారణం చూపి పలు మార్లు తిరస్కరించినట్లు తెలిపారు. దీంతో తమ సెంటర్‌కు పాలు పోస్తున్న రైతులు ఆర్థికంగా నష్టపోతున్నట్లు వాపోయారు. డెయిరీ సిబ్బంది కావాలనే తమ సెంటర్ నుంచి వెళ్తున్న పాలను తిరస్కరిస్తున్నారని.. దీనిపై డెయిరీ అధికారులు న్యాయం చేయాలని కోరాడు. ఈ విషయంపై డెయిరీ అధికారులు స్పందిస్తూ 54 సెంటర్ నుంచి వస్తున్న పాలను పలుమార్లు పరీక్షించగా ఎఫ్ఎస్ఎస్ఏఐ రూల్స్ ప్రకారం క్వాలిటీ లేవన్నారు. ఈ విషయం సెంటర్ దారుడుకి చాలా సార్లు చెప్పామని అయినా పాలలో నాణ్యత పెరగలేదని తెలిపారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాతుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గంగాధర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి మాట్లాడుతూ, కార్మికులు పోరాటాలు, త్యాగాలు చేసి సాధించిన హక్కులను కాలరాస్తోంద ని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను సర్వ నాశనం చేయడమే ధ్యేయంగా మోడీ పాలన సాగిస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుకూలంగా కనీసవేతనం రూ.36 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, స్మార్ మీటర్ల ఏర్పాటు చర్యలు నిలిపి వేయాలని, విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగే సుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, జిల్లా అధ్యక్షుడు గంగాధర్, సలీంబాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్‌కుమార్, గాలిచంద్ర, సికిందర్, వేణుగోపాల్‌రెడ్డి, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు

పీలేరు రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్ర జ్యోతి):ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంలో జాప్యం తగదని ఎన్ఎం యూ అన్నమయ్య జిల్లా ప్రధాన కా ర్యదర్శి పీఎస్ఎం.రాజు అన్నారు. గురు వారం ఆర్టీసీ డిపో వద్ద అపరిష్కృ తంగా ఉన్న తమ డిమాండ్లను పరి ష్కరించాలంటూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 సర్క్యులర్ కచ్చితంగా అమలు చేయాలని డిమాండు చేశారు. నైట్ అలవెన్స్‌ను రూ.400కు పెంచాలని కోరారు. హైయర్ పెన్షన్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వెంటనే మంజూరు చేయాలన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం లేదా ఆర్టీసీ సంస్థ కొనుగోలు చేయాలని కోరారు. ఈహెచ్ఎస్‌కు బదులుగా పాత వైద్య విధానం అమలు చేయాలన్నారు. ఈ ధర్నాలో జోనల్ నాయకులు ఖాజాఫీర్, ఆనంద్, నాయుడు, డిపో అధ్యక్షులు, కార్యదర్శి సివిరమణ, ఆదినారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష తేదీలో మార్పు

పెద్దతిప్పసముద్రం/రామసముద్రం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని 164 ఆదర్శ పాఠశాలల్లో 2025 - 26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో చేరేందుకు ఈ నెల 20న నిర్వహించనున్న ప్రవేశ పరీక్ష వాయిదా పడినట్లు ప్రిన్సిపాల్స్ శివకుమారి, మునస్వామి నాయక్ తెలిపారు. ఆ రోజు ఈస్టర్ పర్వదినం కావడంతో పరీక్షను 21వ తేదీకి వాయిదా వేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. దరఖాస్తుదారులు ఈ మార్పును గమనించాలని కోరారు.

మాన్యం భూముల వేలానికి దొడ్డి దారిన యత్నం

- తిప్పికొట్టిన జనం.. వేలం వాయిదా!

బి.కొత్తకోట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండల పరిధిలోని నల్లగంగమ్మ మాన్యంకు సంబంధించిన షాపింగ్ రూములు, వాణిజ్య అవసరాలకు పనికివచ్చే 9.89ఎకరాల భూముల వేలానికి దేవాదాయశాఖ అధికారులు గురువారం విఫలయత్నం చేశారు. పట్టణ ప్రజలు తిరగబడి ఇదేమి అన్యాయం అని ప్రశ్నించడంతో చేసేదిలేక తోక ముడిచారు. వేలం వాయిదా వేస్తున్నామని ప్రకటించారు. పట్టణంలోని గంగమ్మ ఆలయానికి సంబంధించి 11 షాపింగ్ రూములు. బెంగళూరు రోడ్డులోని విలువైన భూములకు సంబంధించి వేలం పాటలు నిర్వహించేందుకు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఈవో మునిరాజు సిద్ధమయ్యారు . అయితే దీనికి సంబంధించి ముందస్తు పత్రికా ప్రకటన, ప్రచారం లేకపోవడంపై ఇప్పటికే దుకాణ సముదాయంలో ఉన్నవారు, మాన్యం భూమిలో ఇటుక బట్టీలు నిర్వహిస్తున్న వారు తీవ్ర అభ్యంతరం తెలిపారు. వాణిజ్య సముదాయాన్ని ఖాళీ చేయించకుండా వేలం ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. బెంగళూరు రోడ్డుకు ఆనుకొని వున్న మాన్యం భూమిని, కమర్షియల్‌గా కొంత, సాధారణ అవసరాలకు కొంతగా విభజించి వేలం వేయాలని, ఎవరూ పోటీ లేరన్న సాకుతో ఏళ్ల తరబడి అదే వ్యక్తులకు కట్టబెట డంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో చేసేదిలేక వేలాన్ని వాయిదా వేశారు. ఈ నెలాఖరుకు అందరూ ఖాళీ చేయాలని తదుపరి వేలం నిర్వహించే తేదీని ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.



వేలానికి సిద్ధమైన దేవదాయశాఖ అధికారులు

బీఎల్వోలు బాధ్యతగా పని చేయాలి

పెద్దమండ్యం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) ఓటర్ల వివరాల నమోదులో బీఎల్వోలు బాధ్యతగా పని చేయాలని పెద్దమండ్యం తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ సూచించారు. పెద్దమండ్యం తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మండల బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పుల విషయంలో విమర్శలు రాకుండా చూసుకోవా లన్నారు. మృతి చెందిన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించాలన్నారు. ఆర్ఐ సయ్యద్ ఇమ్రాన్, బీఎల్వోలు. రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం:

ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ శ్రీరాములు నాయక్ తెలిపారు. గురువారం ఆయన బీఎల్వోలకు ఓటర్ల నమోదు ప్రక్రియపై అవగాహన సదస్సు నిర్వహించారు.

యూటీఎఫ్ సదస్సును విజయవంతం చేయండి

పీలేరు రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ప్రాంతీయ విద్యా చైతన్య సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కే. సదాశివరెడ్డి, అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. శివారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన పీలేరులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 14న సోమవారం ఉదయం 10 గంటలకు తిరుపతిలోని కచ్చిపి కళాక్షేత్రంలో ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

పీలేరు, ఏప్రిల్ 10 (ఆంధ్ర జ్యోతి): పీలేరు-చిత్తూరు మార్గంలో నిర్మితమవుతు న్న ఆర్‌వోబీ కోసం అధికా రులు గురువారం రోడ్డు పక్కనున్న నిర్మాణాలు తొ లగించారు. ఆర్‌వోబీ పను లు ప్రారంభమై రెండేళ్లు కావస్తున్నా స్థల సేకరణలో జాప్యం, కోర్టు కేసుల కారణంగా పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. రెవెన్యూ, ఎన్‌హెచ్ అధికారులు ఇటీవల పలుమార్లు సమావేశమై ఆ మార్గంలోని అడ్డంకుల తొలగింపుపై చర్చించారు. స్థానికులతో మాట్లాడి వారిని ఒప్పించారు. అనంతరం గురువారం ఉదయం మార్కింగ్ ఇచ్చిన మేరకు భవనాలు, దుకాణాల తొలగింపు కార్యక్రమం ప్రారంభించారు. పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ నేతృత్వంలో ఎస్ఐ లోకేశ్, ఏఎస్ఐ ఉమర్ అలీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్ పనితీరుపై ఫిర్యాదు

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనులను కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్ వివక్ష చూపాడంటూ నవాబుకోటకు చెందిన సుబ్బరాం కొన్ని రోజుల క్రితం సీఎంవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో గ్రామంలోని తమ వర్గం వారికి తప్ప టీడీపీ సానుభూతిపరులకు పనులు లేకుండా చేశాడని, వైసీపీ నాయకులతో కలిసి చేయని పనులకు సైతం బిల్లులు కాజేశాడని ఫిర్యాదులో పేర్కొనడంతో గురువారం ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్‌తో కలిసి ఉపాధి సిబ్బంది ఫీల్డ్ అసిస్టెంట్ పనితీరుపై ఆరా తీశారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈ కళాశాల ప్రిన్సిపాల్ గోపతి బాలకృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటునిస్తుందన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి జనరల్ కోర్సులతోపాటు వృత్తివిద్య కోర్సులకు అడ్మిషన్లు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ, పరిసర ప్రాంతాల విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకులు శివపార్వతీదేవి, శ్రీదేవి, మాలతి, రమణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

వాల్మీకిపురం: స్థానిక పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ సెకెండ్ ఇయర్ విద్యార్థులకు సర్వేపల్లె రాధాకృష్ణన్ విద్యామిత్ర పథకం ద్వారా పుస్తకాలు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఉమాఅమరేశ్వరి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్యా యత్నం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్యా యత్నం చేశారు. వ పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని పొన్నూటిపాళెంకు చెందిన 14 ఏళ్ల బాలిక విషం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పుంగనూరు మండలం, కృష్ణాపురానికి చెందిన 8వ తరగతి విద్యార్థిని పురుగుల మందుతాగింది. వారందరినీ మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు,

రామసముద్రం: మండలంలోని ఆర్.నడింపల్లె పంచాయతీ జంగాలపల్లెకు చెందిన సాకప్ప కుమారుడు మురళీ(27) ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతుండడంతో తండ్రి మందలించాడు. దీంతో మన స్తాపం చెందిన మురళి పురుగుల మందు తాగి ఆపస్మారక స్థితికి చేరుకున్నాడు. 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

కట్నం వేధింపుల కేసు నమోదు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎరిసావలి తెలిపారు. మదనపల్లె పట్టనానికి చెందిన బొమ్మిశెట్టి రెడ్డి గిరిశ్‌తో లక్ష్మీప్రసన్నకు 2022లో వివాహం జరిగింది. అప్పట్లో కట్న కానుకల రూపంలోరూ. రూ.4లక్షలు రెడ్డి గిరిశ్ తీసుకొన్నారని, మళ్లీ కట్నం కోసం వేధిస్తున్నారని గురువారం లక్ష్మీప్రసన్న ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన ట్లు తెలిపారు.

ఉద్యోగిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):మున్సిపల్ ఉద్యోగిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు మదనపల్లె వన్ టౌన్ సీఐ ఎరిసావలి తెలిపారు. పట్టణంలోని రామారావు కాలనీకి చెందిన శ్రీనివాసులు మున్సిపల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విదులు నిర్వహిస్తున్నాడు. తన ఇంటికి సంబంధించిన డిమాండ్ నోటీసు పంపవద్దని మరో జూనియర్ అసిస్టెంట్ మురళీ కృష్ణకు తెలిపారు. అయినా, అతను డిమాండ్ నోటీసును వేసి శ్రీనివాసులకు వాట్సప్ చేశారు. ఈ విషయమై ప్రశ్నించడంతో మురళీకృష్ణ కులంపేరుతో దూషించాడు. షరాబు ఫిర్యాదు మేరకుఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. ఈ విషయమై గురువారం ఎ మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు విచారణ చేశారు. ఇద్దరినీ కుప్పం మున్సిపల్ కార్యాలయానికి బదిలీ చేసినట్లు మున్సిపల్ ఆర్డీ విశ్వనాద్ తెలిపారు.

చాందినీ బండ్లకు అనుమతులు తప్పని సరి

పెద్దమండ్యం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) తిరునాళలో చాందినీ బండ్లకు తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలని ములకలచెరువు సీఐ లక్ష్మన్న తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో గురువారం సీఐ ఆధ్వర్యంలో క్రైమ్ మీటింగ్ అనంతరం జీఎస్ మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్యాన్స్ ప్రోగ్రాంలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. చాందినీ బండ్లకు అనుమతులు తీసుకున్న తర్వాతే భక్తులు మొక్కుబడులు తీర్చుకోవాలన్నారు. ఎస్ఐలు పీవీ రమణ, లోకేష్‌రెడ్డి, నరసింహులు, హరిహరప్రసాద్ పాల్గొన్నారు.